JANASAMAYAM FORTNIGHTLY

TGTEL/26/A2074

# జన సమయం

సామాజిక, రాజకీయ పక్షపత్రిక

సంపుటి:1 సంచిక:12 1-15 అక్టోబర్ 2026 ఎడిటర్: వి. యాదమ్మ పేజీలు:52 వెల:20/-



# వృద్ధురాలి పరిస్థితిపై అదనపు కలెక్టర్ పరిశీలన

## అనంతమ్మ ఆరోగ్య, ఆర్థిక పరిస్థితులపై ఆరా

## సురక్షిత ఆశ్రయం, వైద్యం, సంక్షేమ సహాయం అందేలా చర్యలు

మహబూబ్‌నగర్, (జనసమయం ప్రతినిధి): బండమీదిపల్లిలో 63 ఏళ్ల కురువ అనంతమ్మ చెట్టు కింద, ఆరుబయట జీవనం సాగిస్తున్నారంటూ సోషల్ మీడియాలో వచ్చిన వార్తలపై అదనపు కలెక్టర్ స్పందించారు. వృద్ధురాలి పరిస్థితిని స్వయంగా పరిశీలించేందుకు బండమీదిపల్లికి వెళ్లిన ఆయన, అనంతమ్మను కలిసి ఆమె ఆరోగ్య పరిస్థితి, ఆర్థిక పరిస్థితి,



కుటుంబ సభ్యుల వివరాలు, భూమి, ఆస్తులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధాప్యంతో పాటు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న అనంతమ్మకు ప్రస్తుతం ఎలాంటి వైద్య సహాయం అందుతోంది, ఆమెను ఎవరు సంరక్షిస్తున్నారు, రోజువారీ అవసరాలు ఎలా తీరుతున్నాయనే అంశాలపై అదనపు కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వృద్ధురాలికి అవసరమైన వైద్యం, సంరక్షణ, ఇతర ప్రభుత్వ సహాయం అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

### కుటుంబ సభ్యులు బాధ్యత తీసుకోవాలి

అనంతమ్మను కుటుంబ సభ్యులు బాధ్యతగా చూసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల నుంచి నోటరీ చేయించిన హామీ పత్రం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వృద్ధురాలికి అవసరమైన ఆహారం, వైద్యం, భద్రత, రోజువారీ సంరక్షణ వంటి అంశాల్లో కుటుంబ సభ్యులు తగిన బాధ్యత వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులు హామీ ఇచ్చిన మేరకు వృద్ధురాలిని సంరక్షించకుండా నిర్లక్ష్యం చేస్తే, వర్తించే నిబంధనలు, చట్టపరమైన ప్రక్రియలకు అనుగుణంగా ఆమె భూమి, ఆస్తులకు సంబంధించి తదుపరి చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు.

అవసరమైన సందర్భంలో వృద్ధురాలి సంరక్షణ కోసం ట్రస్ట్ లేదా తగిన సంస్థ ద్వారా కేర్‌టేకర్లను ఏర్పాటు చేసి, ఆమెకు అవసరమైన నిర్వహణ, వైద్య సహాయం అందించే అవకాశాలను పరిశీలిం చాలని అధికారులను ఆదేశిం చారు.

### సురక్షిత ఆశ్రయం కల్పించాలి



అనంతమ్మ ఇకపై చెట్టు కింద లేదా ఆరుబయట జీవించాల్సిన పరిస్థితి లేకుండా సురక్షితమైన ఆశ్రయం కల్పించే అంశాన్ని పరిశీలించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఆమె ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందించడంతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రి లేదా సంబంధిత ఆరోగ్య సదుపాయాల ద్వారా నిరంతర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే అనంతమ్మకు అర్హత ఉన్న వృద్ధాప్య పింఛన్, రేషన్, ఆరోగ్య సేవలు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించి, అర్హత మేరకు అవసరమైన పథకాలను అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమెకు అవసరమైన ఆర్థిక, సామాజిక సహాయం అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

### జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించాలని ఆదేశం

వృద్ధురాలి కుటుంబ పరిస్థితి, ఆరోగ్య స్థితి, ఆస్తులు, భూమి వివరాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హత, కుటుంబ సభ్యుల నుంచి తీసుకున్న హామీ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి వివరమైన నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో వచ్చిన వార్తను పరిగణనలోకి తీసుకుని వృద్ధురాలి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి, ఆమెకు అవసరమైన సహాయం అందేలా అధికారులను ఆదేశించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వృద్ధురాలికి నిరంతర సంరక్షణ, వైద్యం, సురక్షిత జీవనానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

TGTEL/26/A2074

# జన సమయం

సామాజిక, రాజకీయ పక్షపత్రిక

H.No. 4-42-332, Chennareddy Nagar, Asbestos Colony, Hyderabad (TG) 500037

సంపుటి : 01 సంచిక :12 1-15 అక్టోబర్ 2026 పేజీలు : 52 వెల : 20/-

## లోపల పేజీలో....


| | |
|---|---|
| గులాబీ వ్యూహంతోనే | 5 |
| సింగరేణిలో 40లక్షల టన్నుల | 7 |
| రిజిస్ట్రేషన్లపై సర్కార్ | 10 |
| ఫాం హౌస్ లో 10 ఎకరాల | 12 |
| మేడిగడ్డ పనులు మొదలు | 16 |
| రైతులకు కేంద్రం గుడ్‌న్యూస్ | 19 |
| లిక్కర్ స్కామ్ | 23 |
| కొంగర కుర్దు భూములు | 35 |
| రాజ్యాంగం | 40-43 |
| సాహిత్యం | 44 |
| ఆరోగ్యం | 46 |
| క్రీడలు | 48 |
| సినిమా | 49 |


Editor, Publisher & Owned By :
**V. YADAMMA**
H.No. C154,Parvathapur Village,
Ghanapur Mandal
Wanaparthy Dist.Telangana-509380

Editor :
**V. YADAMMA**
H.No. C154,Parvathapur Village,
Ghanapur Mandal
Wanaparthy Dist.Telangana -509380
Cell : 9381205266
email : janasamayam@gmail.com

Printer : **VARDA YADAIAH**
Printed at : Mythri Art Printers,
Shop No. 10, Dcc Bank Complex,
Mahabubnagar,Telangana-509001.

Place of Publication **V.YADAMMA**
H.No. C154,Parvathapur Village,
Ghanapur Mandal, Wanaparthy Dist.
Telangana -509380
Cell : 9381205266

*Ads Manging Director*
Panditi Prudhvi Kumar Reddy
Cell : 8977022449

## సంపాదకీయం

# ఊగిసలాటలో చమురు ధరలు

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వేళ ఇరాన్ కీలక ప్రతిపాదన చేసింది. అమెరికా సైనిక ఒత్తిడిని తగ్గించి, దిగ్బంధనాన్ని ఎత్తివేస్తే ఏడు రోజుల్లో హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు సిద్ధమని తెలిపింది. ఈ విషయాన్ని ఓ సీనియర్ ఇరాన్ అధికారి వెల్లడించినట్లు రాయిటర్స్ తెలిపింది. మధ్యవర్తుల ద్వారా ఈ ప్రతిపాదనను అమెరికాకు చేరవేసినట్లు సమాచారం.అమెరికాతో చర్చలను తిరిగి ప్రారంభించేందుకు ఇరాన్ సిద్ధంగా ఉన్నట్లు ఈ ప్రతిపాదనతో సంకేతాలు ఇచ్చింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సందర్భంగా న్యూయార్క్‌లో మధ్యవర్తి దేశాలతో ఈ అంశంపై చర్చించాలని టెహ్రాన్ భావిస్తోంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య భేటీ ఉ ండబోదని ఇరాన్ అధికారి తెలిపారు. అయితే అమెరికా నిబద్ధత చూపితే ఒప్పందం దిశగా వెళ్లే అవకాశం ఉ ందన్నారు.హర్మూజ్ జలసంధికి సంబంధించిన సైనిక చర్యలను అమెరికా నిలిపివేయాలని ఇరాన్ కోరుతోంది. అమెరికా సైనిక ఒత్తిడిని తగ్గించి, ఇరాన్ పోర్టులపై ఆంక్షలు ఎత్తివేస్తే జలసంధిని తిరిగి తెరిచి చర్చలను కొనసాగిస్తామని టెహ్రాన్ చెబుతోంది. పోర్టులపై ఆంక్షలు ఇరాన్ ముడిచమురు ఎగుమతులు, సముద్ర రవాణాపై ప్రభావం చూపుతున్నాయి. చర్చలను పునరుద్ధరించేందుకు ఇరాన్ గతంలో ఏడు షరతులను కూడా వెల్లడించింది.హర్మూజ్ జలసంధి త్వరలో తెరుచుకునే అవకాశం ఉందన్న వార్తలతో అంతర్జాతీయ చమురు ధరలు తగ్గాయి. బ్యారెల్ చమురు ధర 99 డాలర్ల దిగువకు పడిపోయింది. బ్రెంట్ క్రూడ్ ధర సెషన్ గరిష్ఠ స్థాయి నుంచి 3.5 శాతానికి పైగా తగ్గగా, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ 2.25 శాతం పడిపోయింది. హర్మూజ్ ద్వారా ముడిచమురు సరఫరాలో అంతరాయాలపై ఆందోళనలు తగ్గడంతో ధరలు దిగివచ్చాయి. మురు సరఫరా వ్యవస్థలో తలెత్తిన కీలక పరిణామాలు మరియు మౌలిక వసతులు నరుద్ధరించబడటమే ఈ లభ్యతకు, ఫలితంగా ధరల తగ్గుదలకు ముఖ్య కారణాలుగా నిలుస్తున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఉత్పత్తి దారులలో ???న సౌదీ అరేబియా తమ ‘ఈస్ట్ వెస్ట్ ఆయిల్ పైప్‌లైన్’ ద్వారా సరఫరాలను తిరిగి ప్రారంభించడం మార్కెట్లో సానుకూల వాతావరణాన్ని నింపింది. దీనికితోడు గత కొంతకాలంగా అంతరాయం ఏర్పడిన ఎర్ర సముద్రపు సరుకు రవాణా మార్గాల ద్వారా చమురు ఎగుమతులు మళ్లీ పునరుద్ధరించబడటం అంతర్జాతీయంగా చమురు కొరత భయాలను తొలగించింది. సరఫరా మార్గాలు సజావుగా మారడంతో క్రూడాయిల్ లభ్యత పెరిగి, అంతర్జాతీయ బెంచ్ మార్క్ లైన బ్రెంట్ మరియు డబ్ల్యూటీఐ ధరలు గణనీయంగా దిగిరావడానికి మార్గం సుగమమైంది.వారం రోజుల క్రితం మధ్యప్రాచ్యంలో క్షీణిస్తున్న భద్రతా పరిస్థితులు ,సరికొత్త పరిణామాలతో అమెరికా ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఖతార్ మధ్యవర్తిత్వంతో అమెరికాతో యుద్ధాన్ని ముగించేందుకు తాము ఏడు ప్రధాన షరతులను ప్రతిపాదించినట్లు ఇరాన్ ప్రకటించింది. యుద్ధం పూర్తిగా నిలిచిపోవాలని, ఫ్రీజ్ చేసిన ఇరాన్ నిధులను విడుదల చేయాలని, అలాగే ఇరాన్ ఓడరేవులపై అమెరికా అమలు చేస్తున్న నావికా దిగ్బంధాన్ని ఎత్తివేయాలని టెహ్రాన్ డిమాండ్ చేస్తోంది.

V. yadamma

# గులాబీ వ్యూహంతోనే కాంగ్రెస్...



హైదరాబాద్,జనసమయం :తెలంగాణలో మరోసారి హైవోల్టేజ్ రాజకీయం నడుస్తోంది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీని వ్యూహాత్మకంగా దెబ్బతీసేందుకు, ఆ పార్టీ అగ్రనేతలను వారి సొంత గడ్డపైనే కట్టడి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పక్కా స్కెచ్ వేశారు. ఒకప్పుడు కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ ఇదే తరహా వ్యూహం అమలు చేసింది. ఇప్పుడు అదే వ్యూహాన్నే గులాబీ పార్టీపై అమలు చేసేందుకు సీఎం రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలపై సీఎం రేవంత్ ప్రత్యేకంగా కన్నేశారు. ఈ వ్యూహంలో భాగంగా ప్రతిపక్ష ముఖ్య నేతలను ఉక్కిరిబిక్కిరి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ వరుస బహిరంగ సభలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మొదట బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో గత నెల 30న సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత వచ్చేనెల రెండో వారంలో హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేటలోనూ భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సర్వం సిద్ధమవుతోంది. ఈ రెండు నియోజకవర్గాల తర్వాత బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ టార్గెట్‌గా రేవంత్ రెడ్డి పావులు కదుపుతున్నారు. కేసీఆర్ అసైన్డ్ భూముల లెక్కలు, గత ప్రభుత్వ హయాంలోని భూ ఆక్రమణలపై స్పష్టమైన లెక్కలు తేలాక, గజ్వేల్‌లో బహిరంగ సభను నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ ప్లాన్ చేస్తోంది. ఈ మూడు నియోజకవర్గాల్లో ముందుగా స్థానిక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి, ఆ తర్వాత పూర్తిస్థాయిలో రాజకీయ వ్యూహాన్ని అమలు చేయాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. కేవలం మాటల యుద్ధమే కాకుండా అభివృద్ధి పనులతో ప్రజల ముందుకు వెళ్లి, ఆపై ప్రత్యర్థులపై రాజకీయ దాడి పెంచాలనేది ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ఈ మూడు నియోజకవర్గాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు, బీఆర్ఎస్ అగ్రనేతలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు బలమైన కాంగ్రెస్ నేతలకు ఇక్కడ ప్రత్యేక బాధ్యతలు అప్పగించనున్నారు. అభివృద్ధి ఎజెండాతో మొదలై ఫైనల్‌గా పూర్తిస్థాయి రాజకీయ వ్యూహంతో ముగిసేలా ఈ ప్రణాళికను అమలు చేస్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ ప్రచారం జరుగుతున్న వేళ...

# భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు!



హైదరాబాద్,జనసమయం:వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు.ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

# సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారు..

## బాల్క సుమన్




హైదరాబాద్ :జనసమయం: సింగరేణి సంస్థను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణ అడ్డుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. సింగరేణిని అవినీతి మయం చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి బామ్మర్ది సృజన్ రెడ్డి కింగ్ పిన్‌గా అవినీతి జరుగుతోందన్నారు. జైపూర్ పవర్ ప్లాంట్ లో 334 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది. సింగరేణిలో40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని మండిపడ్డారు. ఒక్కో కార్మికుడికి లాభాల్లో లక్షా 80 వేల కోట్లు తక్కువగా ఇస్తున్నారు.సింగరేణి డబ్బులను సీఎం రేవంత్ రెడ్డి ఫుట్ బాల్ సోకులకు ఖర్చు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి అవినీతిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కేటీఆర్ లెటర్ రాశారు. కార్మికులకు నికర లాభాల్లో 36 శాతం వాటా ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సింగరేణి సంస్థలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 51 శాతాన్ని ప్రైవేట్ వాళ్లకు అమ్ముకోవాలని చూస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్ మేరకు డిప్యూటీ సీఎం భట్టి, అధికారులు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. సింగరేణి అంటే సిరుల గని.సిరిసిల్లకు ఎన్ని నిధులిస్తారో చెప్పాలిసింగరేణి సంస్థను ఎవరికైనా అమ్మితే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అక్టోబర్ 5 వ తేదీన తెలంగాణ భవన్ లో సింగరేణి కోల్ బెల్ట్ ఏరియాలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గ ఇంఛార్జిలు, కార్మిక సంఘం నేతలతో కేటీఆర్ మీటింగ్ ఉంటుందన్నారు. సిరిసిల్లను కేటీఆర్ ఎంతో అభివృద్ధి చేశారు. రేవంత్ రెడ్డికి మైక్ దొరికితే తిట్టడం తప్ప వేరే పని లేదన్నారు. సిరిసిల్లకు రేవంత్ రెడ్డి ఎన్ని నిధులు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి సిరిసిల్లకు టూరిస్ట్ లాంటి వారు. నాయకులను ఓడగొట్టడం, గెలిపించడం ప్రజల చేతుల్లో ఉంటుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్నల ఆత్మహత్యలు జరుగుతున్నాయి. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు చుట్టూ రేవంత్ రెడ్డి రాజకీయం తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు 45 టీఎంసీలు ఇవ్వొద్దని సీడబ్ల్యూసీకి చంద్రబాబు లేఖలు రాస్తున్నారు. నాన్ బేసిన్ కుప్పంకు కృష్ణా నది నీళ్లను తరలించారు.గురువు కండ్లలో ఆనందం కోసం రేవంత్ రెడ్డి తెలంగాణను ఎండబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకో 20 ఏళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ మొలకెత్తదన్నారు.

# ఖైరతాబాద్ లో లక్షా 23 వేల ఓట్లు గల్లంతు



హైదరాబాద్, దానం నాగేందర్ పై అనర్హత వేటు పడడంతో ఖైరతాబాద్ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. అయితే ఇప్పుడు ఖైరతాబాద్‌లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియ ప్రధాన రాజకీయ పార్టీల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. నియోజకవర్గంలో ఊహించని విధంగా అనర్హత ఓట్లు పెద్ద ఎత్తున తెరపైకి వస్తున్నాయి. ఏకంగా సగం మేర ఓటర్ల జాబితా నుంచి మాయం కావడం ఇప్పుడు నగర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య సుమారు 2.93 లక్షలుగా ఉండేది. అయితే? గైర్హాజరు, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్.. తదితర కారణాలతో అధికారులు దాదాపు 1.23 లక్షల ఓట్లను తొలగించారు. దీనివల్ల ఇటీవల ప్రకటించిన ముసాయిదా జాబితాలో ఓటర్ల సంఖ్య 1.70 లక్షలకు పడిపోయింది. ఇందులోనూ మ్యాపింగ్, ఎనామలీస్ జాబితాలో ఉన్న మరో 81 వేల మందికి పైగా ఓటర్లకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులకు స్పందించి సరైన డాక్యుమెంట్లు సమర్పించని వారి పేర్లు కూడా తొలగించే అవకాశం ఉంది. అదే జరిగితే తుది జాబితా నాటికి ఇక్కడి ఓటర్ల సంఖ్య ఏకంగా 1.5 లక్షలకు పడిపోయే తీవ్ర అవకాశముంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన దానం నాగేందర్ దాదాపు 22 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అనర్హత పడడంతో ఇప్పుడు మరోసారి ఎన్నిక అనివార్యమైంది. ఈ తరుణంలో ఓటర్ల సంఖ్య భారీగా తగ్గిపోవడం ఏ పార్టీ విజయావకాశాలను దెబ్బతీస్తుందనే దానిపై సర్వత్రా తీవ్ర చర్చ జరుగుతోంది. పైకి మాత్రం ప్రధాన పార్టీలన్నీ తమ విజయానికి ఢోకా లేదని చెప్తున్నాయి. కానీ, తెరవెనుక పరిణామాలు మాత్రం వారిలో గుబులు పుట్టిస్తున్నాయి. గల్లంతైన ఓట్లలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన సానుభూతిపరులు, కార్యకర్తలు ఉండటంతో ఎవరికి నష్టం జరుగుతుందో అంచనా వేయలేక పార్టీల వ్యూహకర్తలు తలలు పట్టుకుంటున్నారు. ఓట్ల తొలగింపు వ్యవహారం రాజకీయంగా పెను దుమారం రేపుతుండటంతో పార్టీలు అప్రమత్తమయ్యాయి. పార్టీ తరపున ఓట్లను పరిశీలించేందుకు ప్రత్యేక నిపుణులను, లీగల్ సెల్ ప్రతినిధులను రంగంలోకి దించారు. ముసాయిదా జాబితా పరిశీలన బాధ్యతలను కొందరి ముఖ్య నేతలకు అప్పగించారు. నోటీసులు అందుకున్న ఓటర్లను వ్యక్తిగతంగా కలిసి, వారు సరైన డాక్యుమెంట్లు సమర్పించేలా చూడాలని నాయకులు క్షేత్రస్థాయి క్యాడర్‌ను ఆదేశించారు. అలాగే, ఎన్యుమరేషన్ ఫారాలు సక్రమంగా సమర్పించినప్పటికీ, సాంకేతిక లోపాలతో కొందరి పేర్లు ముసాయిదా జాబితాలో గల్లంతు కావడంతో, వారందరితో కొత్తగా ఫామ్-6 ద్వారా పేరు నమోదు చేయించేలా కార్యక్రమాలు చేపడుతున్నారు. నవంబర్‌లో ఎస్ఐఆర్ తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది. అప్పటివరకు ఏ చిన్న అవకాశాన్ని కూడా వదులుకోకూడదని అన్ని పార్టీలు భావిస్తున్నాయి.

**ఎన్నికల బరిలో జనసేన..**

ఖైరతాబాద్ ఉపఎన్నిక వేడి అప్పుడే మొదలైపోయింది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, కవిత పార్టీల మధ్య చతుర్ముఖ పోరు ఉంటుందనుకుంటే, ఇప్పుడు జనసేన పార్టీ ఎంట్రీతో హైదరాబాద్ రాజకీయం ఒక్కసారిగా ఆసక్తికరంగా మారింది. ఇటీవలి కాలంలో తెలంగాణలో జనసేన పార్టీ వేగంగా పుంజుకుంటోంది. పార్టీ జనరల్ సెక్రటరీ రామ్ తాళ్లూరి తెలంగాణ రాజకీయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో పాటు, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు స్పెషల్ ప్లాన్స్ వేస్తున్నారు. ఈ క్రమంలోనే గ్రేటర్ పరిధిలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తమ మార్కు చూపించాలంటే, ఇప్పుడు వచ్చే ఖైరతాబాద్ ఉపఎన్నికను పక్కాగా వాడుకోవాలని జనసేన ప్లాన్ చేస్తోంది. ఆసక్తికరమైన విషయమేమిటంటే.. ఈసారి బీజేపీతో సంబంధం లేకుండా స్వీయ బలంతోనే ఖైరతాబాద్‌లో గ్లాస్ గుర్తును నిలబెట్టాలని జనసేన నిర్ణయించినట్లు కనిపిస్తోంది. పొత్తుల వైపు చూడకుండా ఒంటరిగానే బరిలోకి దిగి జనసేన ఓటు బ్యాంక్ ఏంటో నిరూపించుకోవాలనే ఆలోచనలో రామ్ తాళ్లూరి ఉన్నారు. గ్రేటర్ ఎన్నికలకు ముందు జరిగే ఈ సెమీఫైనల్ పోరులో ఖైరతాబాద్ లాంటి ప్రతిష్టాత్మక స్థానంలో పోటీ చేస్తే, పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం రావడమే కాకుండా అది బలమైన పునాదిగా మారుతుందని భావిస్తున్నారు. ఖైరతాబాద్ బరిలో దింపేందుకు జనసేన ఒక సీనియర్ సినీ నటుడి పేరును పరిశీలిస్తున్నట్లు ఫిలింనగర్, రాజకీయ వర్గాల్లో విపరీతంగా ప్రచారం జరుగుతోంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు అత్యంత ఆప్తుడిగా ఉంటూ, ప్రజల్లో మంచి గ్లామర్, ఫాలోయింగ్ ఉన్న ఒక ప్రముఖ నటుడిని ఈ సీటు నుంచి బరిలోకి దింపే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయట. స్థానిక ఓటర్లతో పాటు యువతను, సినిమా అభిమానులను ఆకట్టుకోవడానికి ఈ గ్లామర్ కాంబినేషన్ పక్కాగా వర్కవుట్ అవుతుందని పార్టీ భావిస్తోంది. ఒకవేళ ఆ సినీ నటుడు ఖైరతాబాద్ రేసులో దిగడం నిజమే అయితే.. ఇన్నాళ్లూ దానం నాగేందర్, తలసాని కుటుంబం, బీజేపీల మధ్య నడుస్తున్న సాంప్రదాయ రాజకీయం ఒక్కసారిగా గ్లామరస్ సమరంగా మారిపోవడం ఖాయం. పవన్ కళ్యాణ్ గ్లామర్, రామ్ తాళ్లూరి వ్యూహాలు, టాలీవుడ్ నటుడి ఇమేజ్ కలసి ఖైరతాబాద్‌లో ఎలాంటి సంచలనం సృష్టిస్తాయో చూడాలి!



# రిజిస్ట్రేషన్లపై సర్కార్ ఉక్కుపాదం



హైదరాబాద్, జనసమయం :మరోసారి ల్యాండ్ పాలిటిక్స్ తెరపైకి వచ్చాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కేటాయింపులు, రిజిస్ట్రేషన్లపై రేవంత్ రెడ్డి సర్కార్ ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సన్నిహితులకు భూబదలాయింపులపై సమగ్ర విచారణ జరిపేందుకు ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది.బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పలు భూముల అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిపుణుల బృందాన్ని రంగంలోకి దించింది. సాంకేతిక, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ ఎ. శ్రీదేవసేన చైర్‌పర్సన్ గా ఓ కమిటీని ఏర్పాటు చేసింది. స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు దీనికి కన్వీనర్ గా వ్యవహరించనున్నారు. జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో పాటు, ఏయే జిల్లాల పరిధిలోని భూములపై విచారణ జరుగుతుందో ఆయా జిల్లాల కలెక్టర్లు సభ్యులుగా ఉంటారు.తెలంగాణ అసెంబ్లీలో 22ఏ దుర్వినియోగం, నిషేధిత భూముల పరిధిపై జరిగిన వాడీవేడి చర్చ ఈ హైలెవల్ కమిటీ ఏర్పాటుకు ప్రధాన కారణమైంది. గత కేసీఆర్ ప్రభుత్వ కాలంలో ప్రభుత్వ భూములు, సీలింగ్ మిగులు భూములు, అసైన్డ్ భూములు, జాగీర్, భూదాన్, ఇనామ్, అటవీ భూములతో పాటు చెరువులు, కుంటల పరివాహక ప్రాంతాల భూములను 22ఏ జాబితా నుంచి నిబంధనలకు విరుద్ధంగా తొలగించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. మార్పిడి చేసి ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారన్న ఈ అంశంపై అసెంబ్లీలో పెద్ద ఎత్తున గందరగోళం చెలరేగడంతో, పరిపాలనాపరమైన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ఈ విచారణ కమిటీకి రేవంత్ సర్కార్ విస్తృతమైన అధికారాలను కల్పించింది. సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, జయశంకర్ భూపాలపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని నిర్దేశిత గ్రామాల్లో చట్టాలు, జీఓలు, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనలను ఈ బృందం సవివరంగా పరిశీలిస్తుంది. ఒకవేళ అక్రమాలు జరిగినట్లు తేలితే, అందుకు బాధ్యులైన అధికారుల నుండి రాజకీయ నాయకుల వరకు అందరి జవాబుదారీతనాన్ని ఖరారు చేసి తగిన చట్టపరమైన చర్యలను సిఫార్సు చేస్తుంది. ఈ విచారణకు సంబంధించి అన్ని రకాల భూ రికార్డులను వెంటనే సమర్పించాలని సంబంధిత జిల్లాల కలెక్టర్లు, సీసీఎల్ఏ, రిజిస్ట్రేషన్ శాఖలను ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది.గత ప్రభుత్వంలో అత్యంత కీలక పదవుల్లో కొనసాగిన అగ్రనేతలు, వారి బంధువులు, అనుచరులతో ముడిపడి ఉన్న భూములే లక్ష్యంగా చేసుకుని ఈ విచారణ సాగుతుండటం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది.

# హై రైజ్ భవనాలకు పొంచి ఉన్న నీటి ముంపు



హైదరాబాద్,జనసమయం:భాగ్యనగరం సహా పలు ప్రధాన నగరాల్లో ఆకాశమే హద్దుగా వెలుస్తున్న హైరైజ్ భవనాలు, లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలలో వందలాది, వేలాది ఫ్లాట్లు నివాసం ఉంటున్నాయి. ఒకే ప్రాంగణంలో వేల సంఖ్యలో జనాభా నివసించే ఈ భారీ అపార్ట్‌మెంట్లలో నిత్యం కోట్లాది లీటర్ల నీరు అవసరమవుతుంది. కేవలం భూగర్భ జలాలపై మాత్రమే ఆధారపడితే కొన్ని రోజుల్లోనే భూగర్భ జలాలు అడుగంటిపోవడం, బోర్లు పూర్తిగా వట్టిపోవడం ఖాయం. దీంతో నగరాల్లోని పెద్ద పెద్ద టవర్ల నిర్వహణకు నీటి సరఫరా అనేది ప్రస్తుతం అత్యంత ఆందోళనకరమైన సమస్యగా మారుతోంది. సాధారణంగా నగరాల్లో మున్సిపల్ కార్పొరేషన్లు , జలమండలి అందించే తాగునీటి సరఫరాపైనే ఈ హైరైజ్ ప్రాజెక్ట్‌లు ఆధారపడాల్సి ఉంటుంది. అయితే, మున్సిపల్ అధికారులు తగినంత నీటి కనెక్షన్‌లు లేదా మౌలిక వసతులు కల్పించని పక్షంలో ఆయా బిల్డర్లు, నివాసితులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీ నుంచి సరైన సమయంలో నీటి సరఫరా అందకపోతే, ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా రోజువారీ నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీనివల్ల అపార్ట్‌మెంట్లలో నివసించే మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థికంగా అదనపు భారం విపరీతంగా పెరుగుతోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా బిల్డర్లు ప్రాజెక్ట్ ప్రారంభ దశలోనే మున్సిపల్ జల సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలించాల్సి ఉంటుంది. మున్సిపాలిటీ నుంచి ప్రత్యేక పైప్‌లైన్ అనుమతులు పొందడం, భారీ సంపులు , ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టడం అత్యంత కీలకం. అంతేకాకుండా, నీటి వృధాను అరికట్టడానికి ఆధునిక మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి, ఆ రీసైకిల్ చేసిన నీటిని ఫ్లషింగ్, గార్డెనింగ్ వంటి ఇతర అవసరాలకు విధిగా ఉపయోగించేలా అంతర్గత ప్లాంట్‌లను డిజైన్ చేయాల్సిన బాధ్యత బిల్డర్లపై ఉంటుంది. ప్రభుత్వాలు , స్థానిక సంస్థలు కూడా భారీ హైరైజ్ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే ముందే, ఆ ప్రాంతానికి సమీపంలో తాగునీటి లభ్యత, సరఫరా సామర్థ్యం ఎంత ఉందనే దానిపై సమగ్ర అంచనా వేయాలి. తగిన మౌలిక వసతులు, తాగునీటి గ్రిడ్ కనెక్షన్లు కల్పించిన తర్వాతే భారీ భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేయాలి. లేనిపక్షంలో, అపార్ట్‌మెంట్ల సంస్కృతి పెరిగినప్పటికీ కనీస తాగునీరు కూడా దొరకని దుస్థితి ఏర్పడి, రేపు భవిష్యత్తులో నగరాలు తీవ్రమైన నీటి యుద్ధాలను ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు గట్టిగా హెచ్చరిస్తున్నారు.

# ఫాం హౌస్ లో10 ఎకరాల అసైన్డ్ భూమి ..?



మెదక్ :మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ అంశం మరోసారి కేంద్ర బిందువుగా మారింది. ఈ భూములపై ప్రభుత్వం శరవేగంగా విచారణ చేపడుతోంది. సిద్ధిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో ఉన్న ప్రభుత్వ గైరాన్ భూములు, అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై రెవెన్యూ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఎర్రవల్లి, సమీప శివారు వెంకాపురం గ్రామాల్లో గత మూడు రోజులుగా భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సర్వే ద్వారా ప్రభుత్వ భూముల హద్దులను స్పష్టంగా గుర్తించారు. ప్రాథమిక విచారణలో కేసీఆర్ ఫాంహౌస్ పరిధిలో సుమారు 10 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నట్లు వెల్లడైంది. అంతేకాకుండా, దళితులకు కేటాయించాల్సిన ఈ భూములను కొందరు అన్యక్రాంతం చేసుకుని, ఫాంహౌస్ అవసరాల కోసం నీటి వనరుల నిర్మాణానికి ఉపయోగించినట్లు తేలింది. భూ ఆక్రమణలపై సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశాల మేరకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు. సర్వే నంబర్ 325 పరిధిలోని సుమారు 388.05 ఎకరాల గైరాన్ భూమి ఆక్రమణలను గుర్తించి, సంబంధిత భూయజమానులకు గత వారంలోనే 180 నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులపై స్పందించాల్సిన భూయజమానులు ఇవాల్టి నుంచి తమ పత్రాలతో అధికారుల ముందు హాజరవుతున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఇతర చట్టబద్ధమైన పత్రాలను సమర్పిస్తే పరిశీలిస్తామని అధికారులు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ రాకతో రికార్డులు తారుమారయ్యాయని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. ఎర్రవల్లి, శివారు వెంకాపురం గ్రామాల మధ్య సర్వే నంబర్లు, భూ రికార్డుల్లో తీవ్రమైన లోసుగులు, ఓవర్‌లాపింగ్ ఉన్నాయని మర్కూక్ తహశీల్దార్ సరితకు స్థానికులు ఫిర్యాదు చేశారు. పాండురంగ రిజర్వాయర్ కోసం భూములు కోల్పోయిన రైతన్నలకు ప్రత్యామ్నాయ భూములు ఇస్తామని గతంలో ఇచ్చిన హామీలు నెరవేరలేదని వాపోతున్నారు. ఈ వివాదంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. వివాదాస్పద సర్వే నంబర్ 325లో నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూములను అనుభవిస్తున్న అనర్హులను తొలగించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించారు. నిజమైన దళిత రైతులకు దక్కాల్సిన భూములను వెనక్కి తీసుకుని, నిరుపేద దళిత కుటుంబాలకు పంపిణీ చేయాలని సర్కార్ భావిస్తోంది. మరోవైపు ఏ ఒక్క దళితుడి లేదా గిరిజనుడి భూమిని ప్రభుత్వం తీసుకోదని, సెక్షన్ 22ఏ పై మళ్లీ సర్వే నిర్వహించి బాధితులకు న్యాయం చేస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టు బిగ్ షాక్- అనర్హత వేటు ఖరారు - ఖైరతాబాద్‌కి ఉపఎన్నికలే!



న్యూఢిల్లీ, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద తనపై తెలంగాణ హైకోర్టు విధించిన అనర్హత వేటును సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను నిర్ద్వంద్వంగా కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పును సమర్థిస్తూ ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిందని, అక్కడ ఉపఎన్నికలకు వెళ్లాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీని రంగంలోకి దించినప్పటికీ, దానం నాగేందర్‌కు ఎలాంటి ఉపశమనం లభించలేదు. విచారణ సమయంలో ధర్మాసనం , లాయర్ రోహత్గీ మధ్య ఆసక్తికరమైన వాదనలు జరిగాయి. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనలను ప్రస్తావిస్తూ స్పీకర్ గతంలో ఇచ్చిన ఆర్డర్ శైలిపై జస్టిస్ బాగ్చి తీవ్ర వ్యంగ్యాస్త్రాలు విసిరారు. దీనిపై రోహత్గీ వాదిస్తూ.. పార్టీ ఫిరాయింపులలో క్షమాపణ, ఘర్ వాపసీ అనే అంశం కూడా ఉంటుందని, నాగేందర్ ఇప్పటికీ తన సొంత పార్టీతోనే ఉంటూ సమావేశాలకు హాజరవుతున్నారని కాపాడే ప్రయత్నం చేశారు. రాజకీయాల్లో అంటరానితనాన్ని, పొరపాట్లను తుడిచేందుకే రాజ్యాంగం ఇలాంటి వెసులుబాటు కల్పించిందని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఈ ఘర్ వాపసీ ప్రతిపాదనను జస్టిస్ బాగ్చి ఏమాత్రం ఆమోదించలేదు. స్వచ్ఛందంగా ఒక పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని వదులుకున్న మరుక్షణమే అసెంబ్లీ సభ్యత్వాన్ని శాశ్వతంగా కోల్పోతారు అని స్పష్టం చేశారు. ఈ రకమైన వ్యూహాలు అనర్హత నుంచి కాపాడలేవని తేల్చిచెప్పారు. మీరు తిరిగి మీ సొంత పార్టీలోకి వెళ్లవచ్చు, కానీ కోల్పోయిన ఎమ్మెల్యే పదవి మాత్రం పునరుద్ధరణ కాదు. అంతగా కావాలనుకుంటే మీ పార్టీ మిమ్మల్ని రాజ్యసభకు పంపుకోవచ్చు అని కోర్టు అత్యంత ఘాటుగా వ్యాఖ్యానించింది. రెండు పార్టీల తరఫున ఒకేసారి చక్రం తిప్పే ప్రయత్నం చేయడం, బి-ఫారాలు తీసుకుని ఎంపీగా

పోటీ చేసి, తిరిగి ఎమ్మెల్యే సీటును రక్షించుకోవాలని చూడటం రాజ్యాంగ విరుద్ధమని ధర్మాసనం తేల్చేసింది. 2023లో బీఆర్ఎస్ తరఫున గెలిచి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై సికింద్రాబాద్ నుంచి పోటీ చేయడం ద్వారా పదో షెడ్యూల్ నిబంధనలను స్పష్టంగా ఉల్లంఘించారని ధర్మాసనం అభిప్రాయపడింది. సుప్రీంకోర్టు కూడా హైకోర్టు నిర్ణయాన్ని సమర్థించడంతో నాగేందర్ సభ్యత్వం అధికారికంగా రద్దయింది.

ఈ తీర్పుతో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉపఎన్నిక అనివార్యమైంది. రాజ్యాంగ స్ఫూర్తిని, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రధాన ఉద్దేశాన్ని కాపాడేలా సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ఇది ఒక గట్టి హెచ్చరికగా నిలవడమే కాకుండా, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఊహించని రాజకీయ పరిణామాలకు దారితీసే అవకాశం ఉందనడంలో సందేహం లేదు.

**నేను పోటీకి సిద్ధం..**

ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ సుప్రీంకోర్టు తీర్పుపై స్పందించారు. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును పూర్తిగా స్వాగతిస్తున్నట్లు తెలిపారు. చట్టపరమైన ప్రక్రియను గౌరవించే తాను న్యాయపోరాటం చేశానని చెప్పారు. ఇక తన భవిష్యత్తును ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటానని స్పష్టం చేశారు. "కోర్టు తీర్పు ఇలా వస్తుందని ముందే ఊహించాను. అయితే రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం కొంత ఊరట లభిస్తుందని భావించాను. అందుకే చట్టపరంగా చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశాను'' అని దానం నాగేందర్ పేర్కొన్నారుఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైన నేపథ్యంలో తాను సిద్ధంగా ఉన్నట్లు దానం తెలిపారు. ఖైరతాబాద్ ప్రజలతో తనకు దశాబ్దాలుగా అనుబంధం ఉందన్నారు. నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ వారికి అండగా ఉన్నానని చెప్పారు. రాబోయే ఉప ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లి వారి ఆశీర్వాదం కోరతానన్నారు. ప్రజల మద్దతు తనకే ఉంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. దీనిపై దాఖలైన అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఆయనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించి ఖైరతాబాద్ సీటు ఖాళీ అయినట్లు పేర్కొంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. నేడు అత్యున్నత న్యాయస్థానం ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సమర్థించింది. దీంతో ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికకు మార్గం ఏర్పడింది.



# రేషన్ కార్డులు... తర్వాత ఫించన్లు

హైదరాబాద్, జనసమయం:తెలంగాణ రాజకీయాల్లో కేవలం రాజకీయంగా విపక్షాలకు ముచ్చెమటలు పట్టించడమే కాకుండా సామాన్య ప్రజలకు పథకాలు విస్తృతంగా అందించి క్షేత్రస్థాయిలో పట్టు పెంచుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఇప్పటికే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న లక్షలాది కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను విజయవంతంగా పట్టాలెక్కించిన కాంగ్రెస్ సర్కార్.. ఇప్పుడు మరో సంచలన నిర్ణయం దిశగా అడుగులేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎదురుచూస్తున్న అర్హులందరికీ అక్టోబర్ నుంచే కొత్త సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే దసరా పండుగకు ముందే లబ్ధిదారుల చేతుల్లో ఈ పింఛన్ నగదు ఉండేలా చూడాలని అధికారులకు అత్యున్నత స్థాయి నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.ఈ మేరకు క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన, వెరిఫికేషన్ ప్రక్రియను శరవేగంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు ఆదేశాలు అందాయి. ఎక్కడా చిన్నపాటి జాప్యానికి కూడా తావులేకుండా, అవసరమైతే మండల, గ్రామ స్థాయిల్లో అదనపు సిబ్బందిని యుద్ధ ప్రాతిపదికన నియమించుకోవాలని ప్రభుత్వం అధికార యంత్రాంగానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క అర్హుడికి పెన్షన్ అందేలా పూర్తి పారదర్శకతతో రికార్డులను సిద్ధం చేయాలని, ఎవరి వద్ద నుంచి ఎలాంటి సిఫార్సులు ఆశించకుండా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల తుది జాబితాను ఖరారు చేయాలని అధికార వర్గాలు ఆదేశించాయి.సమాజంలో అత్యంత నిస్సహాయ స్థితిలో ఉన్న ఒంటరి మహిళలు, వితంతువుల పింఛన్ దరఖాస్తులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏళ్ల తరబడి కొత్త పింఛన్లు మంజూరు కాక,




వృద్ధులు, వితంతువులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగిన దుస్థితిని కాంగ్రెస్ నాయకత్వం గుర్తు చేస్తోంది. ఇప్పుడు అర్హత ఉన్న ఏ ఒక్క ఒంటరి మహిళ లేదా వితంతువు మిగిలిపోకుండా వంద శాతం కవరేజ్ సాధించాలని నిర్ణయించడం ద్వారా.. మహిళా ఓటు బ్యాంకులో కాంగ్రెస్ గ్రాఫ్‌ను అమాంతం పెంచేలా పక్కా గ్రౌండ్ లెవల్ ప్లాన్ సిద్ధమైంది. ఇది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అట్టడుగు వర్గాల్లో ప్రభుత్వానికి తిరుగులేని సానుకూలతను తీసుకువస్తుందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.గత కొద్ది రోజులుగా అసెంబ్లీ వేదికగా కేసీఆర్, కేటీఆర్ లక్ష్యంగా భూ వివాదాలు, ఫామ్‌హౌస్ లీజులు, దానం అనర్హత అంశాలతో విరుచుకుపడుతున్న రేవంత్ రెడ్డి.. సమాంతరంగా సంక్షేమ కార్డును ప్రయోగించడం రాజకీయంగా బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బేనని భావిస్తున్నారు. కాంగ్రెస్ వస్తే పథకాలు ఆగిపోతాయి అంటూ బీఆర్ఎస్ చేసిన ప్రచారాన్ని తొలుత రేషన్ కార్డుల మంజూరుతో, ఇప్పుడు దసరా కానుకగా కొత్త పెన్షన్ల ప్రకటనతో ప్రభుత్వం పటాపంచలు చేసింది. సంక్షేమ లబ్ధిదారులను నేరుగా తమ వైపు తిప్పుకోవడం ద్వారా. ట బీఆర్ఎస్ సంప్రదాయ ఓటు బ్యాంకును గండికొట్టేలా రేవంత్ ప్రభుత్వం వేసిన ఈ డబుల్-స్ట్రోక్ రాజకీయ సమీకరణాలను సమూలంగా మార్చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మేడిగడ్డ పనులు మొదలు ఇక



కరీంనగర్ :తెలంగాణలో కొంతకాలంగా రగిలిపోతున్న ప్రధాన అంశాలలో మేడిగడ్డ ఒకటి. కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రధాన బ్యారేజీలలో మేడిగడ్డ ఒకటి. అయితే ఇది కుంగిపోవడంతో రాజకీయ వివాదానికి దారితీసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ ప్రాజెక్టు వైఫల్యాలపై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దర్యాప్తునకు ఆదేశించింది. అయితే మేడిగడ్డను పునరుద్ధరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తోందని, కేవలం బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా బద్నాం చేయడమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి సర్కార్ వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తూ వచ్చారు. ఈ విమర్శలకు చెక్ పెడుతూ ఎట్టకేలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ దిశగా కీలక అడుగులు వేసింది.మేడిగడ్డ కుంగుబాటు కేవలం ఇంజనీరింగ్ వైఫల్యమా లేక రాజకీయ కుట్రల ఫలితమా అనే చర్చ గత రెండేళ్లుగా తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తోంది. బ్యారేజ్ కుంగిన వెంటనే ప్రతిపక్ష బీఆర్ఎస్ దీనిని కేవలం సాంకేతిక లోపంగా, ప్రకృతి విపత్తుగా అభివర్ణించింది. అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం దీనిని అవినీతి కట్టడంగా విమర్శించింది. బ్యారేజ్‌ను బాగుచేయకపోతే రాష్ట్రానికి తాగు, సాగునీటి కష్టాలు తప్పవంటూ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఒత్తిడి తెచ్చింది. అయినా ప్రాజెక్టు పునరుద్ధరణపై ఇన్నాళ్లూ కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. అయితే ఇప్పుడు పునరుద్ధరణ పనులకు నడుం బిగించింది.నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సిఫార్సులు, ఐఐటీ బాంబే నిపుణులు, అంతర్జాతీయ కన్సల్టెన్సీల సాంకేతిక నివేదికల ఆధారంగా ప్రభుత్వం మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజ్‌లకు కూడా సమగ్ర పునరుద్ధరణ ప్రణాళికలను సిద్ధం చేసింది. బ్యారేజ్ మొత్తం వెడల్పు మేరకు ఎండ్ టు ఎండ్ డయాఫ్రమ్ వాల్ నిర్మించి, పునాది భద్రతను పటిష్టం చేయాలని నిర్ణయించారు. అంతేకాకుండా వరద ఉధృతిని నియంత్రించడానికి దిగువన ఉన్న స్టిల్లింగ్ బేసిన్‌లను బలోపేతం చేయనున్నారు. ఈ పనులను రాబోయే వర్షాకాలం లోపే.. అంటే 2027 జూన్ నాటికి పూర్తి చేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. దెబ్బతిన్న నిర్మాణాలను పునరుద్ధరించడం సాంకేతికంగా క్లిష్టమైనప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా వెనుకంజ వేయబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది.ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వెనుక బలమైన రాజకీయ వ్యూహం ఉంది. మేడిగడ్డను వదిలేశారు.. రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోవట్లేదు.. అనే బీఆర్ఎస్ విమర్శలకు ప్రభుత్వ నిర్ణయం గట్టి సమాధానం ఇస్తుంది. ప్రాజెక్టుల పునరుద్ధరణకు తాము వ్యతిరేకం కాదని, కేవలం అవినీతి బండారాన్ని బట్టబయలు చేయడమే తమ ఉద్దేశమని చాటిచెప్పినట్లయింది. ప్రజలకు ఉపయోగపడేలా శాశ్వత పరిష్కారాలు చూపుతున్నామని నిరూపించుకునేందుకు కాంగ్రెస్ పార్టీకి ఇది గొప్ప అవకాశంగా మారింది. రాజకీయ లబ్ధి కోసం కాలయాపన చేస్తున్నారన్న అపవాదును తొలగించుకోవడంలో రేవంత్ రెడ్డి సర్కార్ సఫలమైందనే చెప్పాలి.

# ఇందిరమ్మ భీమాతో కలిసొచ్చేనా...?




హైదరాబాద్, జనసమయం:తెలంగాణలో మరో కీలక హామీ అమలుకు రంగం సిద్ధమవుతోంది. ఎన్నికల సమయంలో పలు కీలక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.., అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయట్లేదనే విమర్శలు ఎదర్కొంటోంది. అలాంటి వాటిలో ఇందిరమ్మ బీమా పథకం ఒకటి. ఇప్పుడు ఈ స్కీంను అమలు చేసేందుకు సన్నద్ధమైంది. గత నవంబర్ 19న ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు ఇచ్చింది. వీటిని కచ్చితంగా అమలు చేస్తామని మాటిచ్చింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ (గృహజ్యోతి), రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిని రూ. 10 లక్షలకు పెంపు వంటి వాటిని ఇప్పటికే అమలు చేస్తోంది.తాజాగా 'ఇందిరమ్మ బీమా' ద్వారా ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల వరకు ఉచిత బీమా కవరేజ్ కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అట్టడుగు వర్గాల కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇంటి పెద్దను కోల్పోయి ఆర్థికంగా చితికిపోతున్న కుటుంబాలకు ఈ బీమా పథకం ఒక పెద్ద దిక్కుగా మారుతుందనడంలో సందేహం లేదు. ఇందిరమ్మ బీమా పథకాన్ని నవంబర్‌లో ప్రారంభించడం ద్వారా, రాబోయే గ్రాడ్యుయేట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల మద్దతును మరింత సుస్థిరం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది.పథకాలను అనౌన్స్ చేయడం సులభం. అయితే క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఎటువంటి అవినీతికి తావులేకుండా ఈ బీమా ఫలాలను చేరవేయడం ప్రభుత్వానికి అసలు సిసలు పరీక్ష. గతంలో ఉన్న లోపాలను సరిదిద్దుతూ, పారదర్శకమైన విధానంలో ఈ బీమాను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. విద్యారంగంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత అల్పాహారం వంటి విప్లవాత్మక మార్పులకు, ఈ బీమా పథకం కూడా తోడైతే ప్రభుత్వానికి తిరుగుండదని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు.

# కాచిగూడ రైల్వేస్టేషన్ కొత్త సొబగులు




హైదరాబాద్, జనసమయం:భాగ్యనగర చారిత్రక శోభకు, నిజాం కాలం నాటి నిర్మాణ వైభవానికి ప్రతీకగా నిలిచే కాచిగూడ రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. చారిత్రక వారసత్వాన్ని కాపాడుతూనే ప్రయాణికులకు ఆధునిక సదుపాయాలు అందించేలా స్టేషన్ పునరాభివృద్ధికి దక్షిణ మధ్య రైల్వే ప్రాథమిక ప్రణాళిక సిద్ధం చేసింది. డ్రాఫ్ట్ కాన్సెప్ట్ ప్లాన్ ప్రకారం సుమారు రూ.474.29 కోట్ల అంచనా వ్యయంతో స్టేషన్‌ను ఆధునీకీకరించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. ప్రస్తుతం ఇది కేవలం డ్రాఫ్ట్ ప్లాన్ మాత్రమేనని, తుది ప్రణాళికలో కొన్ని మార్పులు, చేర్పులు ఉండే అవకాశం ఉందని రైల్వే అధికారులు తెలిపారు. స్టేషన్ పశ్చిమ వైపున ఉన్న పురాతన హెరిటేజ్ భవనాన్ని యథాతథంగా పరిరక్షించాలని ప్రతిపాదించారు. అదే సమయంలో తూర్పు వైపు, అంబర్‌పేట వైపున ఆధునిక టెర్మినల్ భవనాన్ని నిర్మించేలా డ్రాఫ్ట్ ప్లాన్‌ను రూపొందించారు. దీంతో పాత నిర్మాణానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యాన్ని కాపాడుతూనే కొత్త అవసరాలకు అనుగుణంగా స్టేషన్‌ను విస్తరించే అవకాశం ఏర్పడుతుంది. ప్లాట్‌ఫాంల పైన 72 మీటర్ల వెడల్పు, 115 మీటర్ల పొడవుతో విశాలమైన ఎయిర్ కాన్‌కోర్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇందులో ఫుడ్ కోర్టులు, ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు, రిటైల్ అవుట్‌లెట్లు, ప్రదర్శన హాళ్లు, పిల్లల ఆట స్థలాలు వంటి సదుపాయాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రయాణికులు రైలు కోసం వేచి ఉండే సమయంలో మెరుగైన సౌకర్యాలు పొందేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు. స్టేషన్‌లో రద్దీని తగ్గించి ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేయడంపై కూడా ప్రణాళికలో దృష్టి పెట్టారు. రైలు ఎక్కే ప్రయాణికులు, రైలు దిగే ప్రయాణికులు ఒకరికి ఒకరు అడ్డంకిగా మారకుండా విడివిడిగా మార్గాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అవసరమైన చోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌కు పక్కనే ఉన్న ఆర్టీసీ బస్ స్టేషన్‌తో మెరుగైన కనెక్టివిటీ కల్పించేందుకు స్కైవాక్ నిర్మాణాన్ని కూడా ప్రతిపాదించారు. పశ్చిమ, తూర్పు వైపుల వాహనాల పార్కింగ్ కోసం మల్టీ లెవల్ కార్ పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రణాళికలో పొందుపరిచారు. రైలు, బస్సు, వ్యక్తిగత వాహనాల రాకపోకలను సమన్వయం చేసేలా మల్టీమోడల్ కనెక్టివిటీని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కనిపిస్తోంది. కాచిగూడ రైల్వే స్టేషన్ హైదరాబాద్ రైల్వే చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. 1916లో నిజాం కాలంలో నిర్మించిన ఈ స్టేషన్ భవనం ఇండో–ఇస్లామిక్ వాస్తుశిల్ప శైలికి, ఆ కాలం నాటి నిర్మాణ నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తోంది. నిజాం స్టేట్ రైల్వేస్ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటైన ఈ స్టేషన్ అప్పట్లో హైదరాబాద్ నగరానికి కీలక రైల్వే కేంద్రంగా మారింది. కాలక్రమంలో నగరం విస్తరించడంతో కాచిగూడ స్టేషన్ ప్రాధాన్యం కూడా పెరిగింది. దశాబ్దాలుగా లక్షలాది మంది ప్రయాణికులకు సేవలందిస్తున్న ఈ చారిత్రక భవనం నేటికీ తన ప్రత్యేక రూపాన్ని నిలుపుకుంది.

# రైతులకు కేంద్రం గుడ్‌న్యూస్..

# కనీస మద్దతు ధర పెంపు, ఏ పంటకు ఎంత

న్యూఢిల్లీ, కేంద్ర ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా రబీ పంటలకు సంబంధించి 2027-28 సీజన్‌కు మద్దతు ధరను నిర్ణయించింది. గోధుమలు, బార్లీ (జౌ), శనగలు, ఆవాలు, పొద్దుతిరుగుడు (కుసుమ), మసూర్ (కందులు/ చిరుధాన్యాల రకం) పంటల కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం పెంచింది. గోధుమలపై క్వింటాలుకు రూ.25 పెంచారు.కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. కనీస మద్దతు ధరలో అత్యధికంగా కుసుమ పంటకు క్వింటాలుకు ?675 చొప్పున పెంపుదల చేశారు. ఆ తర్వాత రేప్‌సీడ్, ఆవాలకు క్వింటాలుకు ?413 చొప్పున పెంచారు. మసూర్ పంటకు క్వింటాలుకు ?390, బార్లీకి (జౌ) క్వింటాలుకు ?136, శనగలకు క్వింటాలుకు ?83, గోధుమలకు క్వింటాలుకు 25 చొప్పున పెంచారు.

నిర్ణయించిన కనీస మద్దతు ధరల , వివరాలు

గోధుమలు: క్వింటాలుకు ?2,610

శనగలు: క్వింటాలుకు ?5,928

బార్లీ (జౌ): క్వింటాలుకు ?2,286

మసూర్: క్వింటాలుకు ?7,390

ఆవాలు: క్వింటాలుకు ?6,613

పొద్దుతిరుగుడు (రాజీటటశ్రీనీలివతీ) క్వింటాలుకు: ?7,215

ఢిల్లీ ట్రాఫిక్ నిర్వహణను మెరుగు చేయడం కోసం 'ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' తీసుకురావాలని కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 1,529 ట్రాఫిక్ సిగ్నల్స్ స్థిరమైన మ్యాన్యువల్ పద్ధతిలో ఉన్నాయి. అయితే ఎెటూ వచ్చిన తర్వాత ఈ సిగ్నల్స్ ట్రాఫిక్ రద్దీకి



తగ్గట్లుగా సిగ్నల్ సమయాన్ని అవే అడ్జస్ట్ చేసుకుంటాయి. దీనిని మూడు విడతలలో (ఫేజ్‌లలో) అమలు చేయనున్నామని తెలిపారు. వేర్వేరు కారిడార్లలో వేర్వేరు సమయాల్లో ఈ పద్ధతిని అమలు చేస్తారు. ఇందుకోసం కేంద్రం 1,790 కోట్ల రూపాయలు ఖర్చు చేయనుందని తెలిపారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్‌తో కలిపి రెన్యూవబుల్ ఎనర్జీ సరఫరా చేయడం కోసం 1.86 లక్షల కోట్ల అంచనాతో కూడిన 'గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్ ఎఎ' పథకానికి కూడా మోదీ కేబినెట్ ఆమోదం తెలిపింది.దేశంలో శాస్త్రీయ పరిశోధనలు, వినూత్న ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 'పీఎం ధార' పథకాన్ని తీసుకొచ్చింది. రూ. 1,86,405 కోట్లను ఈ పథకానికి కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది.

# సస్పెండైన డీఎస్పీ భీమ్‌రెడ్డి.. అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం

హైదరాబాద్, అక్రమాస్తుల కేసులో సస్పెండైన తెలంగాణ మాజీ డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డి వ్యవహారంలో దర్యాప్తు సంస్థలు దూకుడు పెంచాయి. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దర్యాప్తు కొనసాగుతుండగానే, తాజాగా ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) కూడా రంగంలోకి దిగింది. భీమ్‌రెడ్డికి బినామీలుగా వ్యవహరించారని అనుమానిస్తున్న 8 మందిపై బినామీ ఆస్తుల నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేయడం సంచలనం సృష్టిస్తోంది. దేశంలోనే ఈ చట్టం కింద ఇలాంటి కేసులు నమోదు కావడం ఇదే తొలిసారి అని అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ కేసులో దర్యాప్తు మరింత తీవ్రరూపం దాల్చింది. డీజీపీ కార్యాలయంలోని పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న సమయంలో భీమ్‌రెడ్డిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. జూన్ 27న కేసు నమోదైన తర్వాత తెలంగాణ, కర్ణాటకలోని 16 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ. 200 కోట్లకు పైగా విలువైన భూములు, ఇళ్లు, ప్లాట్లు, బ్యాంకు డిపాజిట్లను గుర్తించినట్లు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి. ఈ భారీ ఆస్తుల గుర్తింపుతో కేసు తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. ఏసీబీ దర్యాప్తులో కొన్ని ఆస్తులు ఇతరుల పేర్లతో ఉన్నట్లు తేలింది. వీటి వెనుక భీమ్‌రెడ్డి పెట్టుబడులు ఉన్నాయనే అనుమానంతో అధికారులు బినామీ కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఇందుకోసం కోర్టు నుంచి ప్రత్యేకంగా సెర్చ్ వారెంట్లు పొంది, భీమ్‌రెడ్డికి చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ వెంకటేష్ సహా మొత్తం 8 మంది ఇళ్లలో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని పుప్పాలగూడతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన ఈ తనిఖీల్లో కీలకమైన ఆస్తుల పత్రాలు, నగదు, బంగారంతో పాటు ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ అందించిన సమాచారం ఆధారంగా ఐటీ శాఖ ఈ కేసులో కీలక అడుగు వేసింది. భీమ్‌రెడ్డికి బినామీలుగా అనుమానిస్తున్న 8 మందిపై బినామీ ప్రాపర్టీ ట్రాన్సాక్షన్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసింది. ఈ ఆస్తుల కొనుగోలుకు నిధులు ఎక్కడి నుంచి వచ్చాయి? ఆస్తులకు అసలు యజమాని ఎవరు? వాటిని ప్రస్తుతం ఎవరు నియంత్రిస్తున్నారు? అనే కోణాల్లో ఐటీ అధికారులు లోతుగా విచారణ జరుపుతున్నారు. బినామీ చట్టం కింద కేసులు నమోదైన నేపథ్యంలో, దర్యాప్తులో ఆరోపణలు రుజువైతే సంబంధిత ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. ఈ కేసులో సుమారు 57 రోజుల పాటు చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న భీమ్‌రెడ్డి, సెప్టెంబర్ 1న బెయిల్‌పై విడుదలయ్యారు. అయినప్పటికీ, ఆయనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఏసీబీ ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువే రూ. 200 కోట్లకు పైగా ఉండగా, బినామీ ఆస్తులు కూడా వెలుగులోకి వస్తే ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏసీబీ, ఐటీ శాఖలతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ కేసులో భీమ్‌రెడ్డితో పాటు ఆయన బినామీల చుట్టూ ఉచ్చు మరింత బిగుస్తోందని స్పష్టమవుతోంది.

# రైతుల పేరుతో రాజకీయం చేస్తున్న బీఆర్ఎస్...

## ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్,జనసమయం:కేటీఆర్ వ్యాఖ్యలకు ఎంపీ చామల కిరణ్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ ఏదో జరుగుతున్నట్లు బిఆర్ఎస్ పార్టీ నేతలను ఆరు బృందాలుగా పవర్ స్టేషన్ల వద్దకు పంపుతున్నారు. కేసీఆర్ విద్యుత్ ఛార్జీల కోసం పోరాటం చేశారని కేటీఆర్ అబద్దాలు చెప్తున్నారు. 2,000 సంవత్సరంలో బషీర్ బాగ్ కాల్పులు జరిగినప్పుడు కేసీఆర్ టీడీపీలోనే ఉన్నారని అన్నారు.కేసీఆర్ 2001 లో టీడీపీ నుంచి బయటకు వచ్చారు. మంత్రి పదవి ఇవ్వలేదు,డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చారని కేసీఆర్ టీడీపీ నుంచి బయటకు వచ్చారు.కేటీఆర్ చరిత్ర తెలుసుకో. రైతులకు ఉచిత విద్యుత్ పేటెంట్ హక్కు కాంగ్రెస్ పార్టీది. బిఆర్ఎస్ హయాంలో డిస్కంలలో 81 వేల కోట్ల అప్పులు చేశారు. ఛత్తీస్ ఘడ్ నుంచి వెయ్యి మెగావాట్ల విద్యుత్ ను బీఆర్ఎస్ ప్రభుత్వం కొనుగోలు చేసింది.కేసీఆర్ పిట్ట కథలు చెప్పడం బంద్ చేయాలని అన్నారు.చత్తీస్ ఘడ్ విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయి. ఇతర రాష్ట్రాల్లో తక్కువకే విద్యుత్ లభించే అవకాశం ఉన్నా చత్తీస్ ఘడ్ తో ఒప్పందం చేసుకున్నారు. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో సూపర్ క్రిటికల్ టెక్నాలజీ బదులు సబ్ క్రిటికల్ టెక్నాలజీ వాడి వెయ్యి కోట్లు నష్టం కలిగించారు. యాదాద్రిని ఓపెన్ బిడ్డింగ్ పెట్టకుండా నామినేషన్ పద్ధతిలో బి.హెచ్.ఈ.ఎల్ కు ఇచ్చి కమిషన్లు తీసుకున్నారు. విద్యుత్ పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడింది. మాజీ విద్యుత్ శాఖా మంత్రి జగదీష్ రెడ్డికి ఫామ్ హౌస్ లు ఎక్కడివి. ఎల్ నినో పై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. రైతులకు మేలు జరగాలని బిఆర్ఎస్ కోరుకోవాలి. రైతుల పేరుతో రాజకీయం చేస్తున్నారు. విపత్తులో రైతులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని బిఆర్ఎస్ ఆలోచన చేస్తోంది. రైతులు ఎక్కువగా వరి పంటపై కాకుండా ఇతర పంటలపై




దృష్టి పెట్టాలని ప్రభుత్వం అవగాహన కల్పిస్తోందని అన్నారు. ప్రాజెక్టుల పేరుతో ఏ ప్రాజెక్టుల వద్ద ఎంత అవినీతికి పాల్పడ్డారో మా వద్ద లెక్క ఉంది. నామినేషన్ పద్ధతిలో పవర్ ప్రాజెక్టుల కాంట్రాక్టులు ఇచ్చి కమిషన్లు పొందారు. నిరంతరం రైతులకు,ప్రజలకు కరెంటు ఇవ్వాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ఫామ్ హౌస్ బాగోతాలను డైవర్ట్ చేయాలని బిఆర్ఎస్ ప్రయత్నం చేస్తోంది. తమకు ఓట్లు వేయలేదని ప్రజలు,రైతులపై బిఆర్ఎస్ కక్ష పెట్టుకుంది. ఎల్ నినోతో వచ్చిన కరువును కాంగ్రెస్ పై నెపం నెట్టాలని బిఆర్ఎస్ చూస్తోంది. బిఆర్ఎస్ రైతులను రెచ్చగొట్టి పంటకు వేయించి రైతులు ఆగం కావాలని భావిస్తోంది. బిఆర్ఎస్ ను రైతులు,ప్రజలు క్షమించరు. రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ నేతల ఫైల్స్ ను ఒక్కొక్కటి బయట పెడతాము. మిగులు రాష్ట్రాన్ని 10 ఏళ్ళల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల మయం చేసిందని ఆరోపించారు.

# రిమ్స్‌లో చిన్నారుల మరణాలు ప్రభుత్వ హత్యలే..

## టీఆర్ఎస్ చీఫ్ కవిత

అదిలాబాద్, ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ఏసీ పేలుడు ఘటనలో ఐదుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. బాధితులను తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత బుధవారం పరామర్శించారు. రిమ్స్ హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదం జరిగిన ఎస్ఎన్‌సీయూను ఆమె పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రిమ్స్‌లో చిన్నారుల మరణాలు ప్రభుత్వ హత్యలే అని విమర్శలు చేశారు. దత్తత తీసుకున్న జిల్లాలో చిన్నారులు చనిపోతే ముఖ్యమంత్రికి వచ్చే తీరిక లేదా? అని ప్రశ్నించారు. ఫుట్‌బాల్ ఆడేందుకు, విదేశాల్లో తిరిగేందుకు మాత్రం సమయం ఉంటుందా? అని ఎద్దేవా చేశారు. హెల్త్ మినిస్టర్ ఎక్స్‌కర్షన్‌కు వచ్చినట్లు వచ్చి బాధ్యత లేకుండా వ్యవహరించారని మండిపడ్డారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని కవిత డిమాండ్ చేశారు. నెల రోజుల్లో హాస్పిటల్ పెండింగ్ బిల్లు చెల్లించాలని, ఆదివాసీ ప్రాంతాలకు రోడ్లు వేయాలన్నారు. లేదంటే ఏజెన్సీల్లోని ఆదివాసీలతో కలిసి ఆదిలాబాద్‌ను ఘెరావ్ చేస్తామన్నారు. "ఆదిలాబాద్ రిమ్స్‌లో హృదయవిదాకరమైన సంఘటన జరిగింది. రోజులు కూడా నిండకముందే ఐదుగురు పసివాళ్లకు నిండు నూరేళ్లు నిండాయి. ఇది ప్రమాదవశాత్తు జరిగిన సంఘటననో, ప్రకృతి ప్రకోపం కారణంగానో జరగలేదు. కేవలం ఈ కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం కారణంగా జరిగిన సంఘటనే. ఇదే మొదటి సంఘటన కాదు. ఈ హాస్పిటల్‌లో గతేడాది 204 మంది, అంతకుముందు ఏడాది 174 మంది చిన్నారులు చనిపోయారు. ఇలాంటి పరిస్థితి ఉన్నప్పుడు ఇక్కడ పరిస్థితులపై ప్రభుత్వం బేరీజు వేసుకోని చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల నుంచి



హాస్పిటల్‌కు వచ్చేందుకు సరైన రోడ్లు లేవు. ఏ రోజు పేపర్ చూసిన గర్భిణీ మృతి, చిన్నారులు మృతి అనే వార్తలే ఉంటున్నాయి. ఈ పరిస్థితి గురించి వార్తలు రాసి, కథనాలు ప్రచురించి మీడియా వాళ్లే విసిగిపోయారు"– కవిత 150 మంది డాక్టర్లు ఉండాల్సిన ఆసుపత్రిలో సగం మంది కూడా లేరని కవిత ఆరోపించారు. నర్సులు సగం మందే ఉన్నారని, శానిటేషన్ సిబ్బంది 20 శాతం మాత్రమే ఉన్నారన్నారు. సిబ్బందితో నడ్డి విరిగేలా పనిచేయిస్తూ వాళ్లను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. 150 ఏసీలు ఉంటే ఒక్క మెకానిక్ లేడని, ముగ్గురు ఎలక్ట్రీషియన్స్ మాత్రమే ఉన్నారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద 500 కోట్ల రూపాయల బకాయిలు రావాల్సి ఉందన్నారు. ఈ సంఘటనకు హాస్పిటల్ సిబ్బంది గానీ పేషెంట్లది గానీ తప్పు కాదన్నారు. ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానని ముఖ్యమంత్రి చెప్పారని, దత్తత తీసుకున్న జిల్లా పరిస్థితి ఇలా ఉంటుందా? ఐదు మంది పిల్లలు చనిపోతే వచ్చి చూసేందుకు తీరక లేదా? అని ప్రశ్నించారు.

# లిక్కర్ స్కామ్ గుట్టు దొరికేసింది...

హైదరాబాద్, వైఎస్సార్‌సీపీ హయాంలో ఆంధ్రప్రదేశ్‌ను ఊపేసిన వేల కోట్ల లిక్కర్ స్కామ్ వ్యవహారంలో నాటి ప్రభుత్వం, అప్పటి సీఎం జగన్ మోహన్ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. నాటి ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన సీనియర్ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవ కోర్టులో ఇచ్చిన స్టేట్‌మెంట్ ఇప్పుడు పెను తుఫాను రేపుతోంది. మద్యంపాలసీ రూపకల్పన నుంచి మద్యం విక్రయాల వరకు అంతా నాటి సీఎంవో కనుసన్నల్లోనే, పూర్తి స్థాయి రాజకీయ ఒత్తిళ్ల మధ్యే జరిగిందని ఆయన న్యాయస్థానం ముందు నిజాలను పూసగుచ్చినట్లు వివరించారు. ఈ వాంగ్మూలంతో మద్యం స్కామ్ వెనుక అసలు సూత్రధారి నాటి ముఖ్యమంత్రి జగనేనన్న ఆరోపణలకు బలమైన సాక్ష్యం లభించినట్లయింది. రజత్ భార్గవ తన వాంగ్మూలంలో నాటి సీఎంవో అధికారుల పాత్రను బహిరంగంగా ఎండగట్టారు. ప్రవీణ్ ప్రకాష్, కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ్ రెడ్డి వంటి అధికారులు సీఎంవో తరఫున ప్రత్యక్షంగా చక్రం తిప్పారని, తనకు , ఎక్సైజ్ శాఖ అధికారులకు నిరంతరం ఫోన్లు చేస్తూ తీవ్ర ఒత్తిడి తెచ్చారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా తమకు కావలసిన వారికి లబ్ధి చేకూర్చేలా జీవోలు ఇప్పించుకున్నారని స్పష్టం చేశారు. చివరికి ఎన్నికల సమయానికి ఈ భారీ కుంభకోణం బయటపడే ప్రమాదం ఉందని గ్రహించిన సీఎంవో పెద్దలు, స్కామ్ మొత్తాన్ని అధికారుల నెత్తిపై రుద్దేందుకు పక్కా ప్లాన్ వేశారని.. అయితే తాను మాత్రం చట్టవిరుద్ధమైన పత్రాలపై సంతకాలు చేయకుండా తప్పుకున్నానని కోర్టుకు వెల్లడించారు. ఇప్పటికే ఈ కేసులో మరో కీలక అధికారి సత్యప్రసాద్ కోర్టుకు వాంగ్మూలం ఇచ్చిన సమయంలో వైఎస్సార్‌సీపీ నేతలు తీవ్రంగా స్పందించిన తీరు అందరికీ గుర్తుండే ఉంటుంది.



అప్పట్లో సత్యప్రసాద్ మానసిక స్థితి సరిగా లేదని, ఆయనకు మెంటల్ సర్టిఫికెట్ ఉందంటూ తీవ్ర స్థాయిలో వ్యక్తిత్వ హననానికి దిగడమే కాకుండా మీడియా ముందే విమర్శలు గుప్పించారు. ఇప్పుడు రజత్ భార్గవ లాంటి సీనియర్ ఐఏఎస్ అధికారి కూడా నేరుగా సీఎంవో మరియు జగన్ రెడ్డి ఒత్తిళ్ల వల్లే అక్రమాలు జరిగాయని ఆధారాలతో సహా పూసగుచ్చినట్లు బయటపెట్టడంతో నాటి అధికార పార్టీ నేతలు డిఫెన్స్‌లో పడ్డారు. సత్యప్రసాద్ ఇచ్చిన వాంగ్మూలాన్ని తప్పించుకోవడానికి మెంటల్ డ్రామాలు ఆడిన వైఎస్సార్‌సీపీ నేతలు, ఇప్పుడు రజత్ భార్గవ ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై ఎలాంటి వికారపు వ్యాఖ్యలు చేస్తారోనని సర్వత్రా చర్చ నడుస్తోంది. ఐఏఎస్ అధికారులే స్వయంగా కోర్టులో సీఎంవో అక్రమాలను పూసగుచ్చినట్లు చెప్పడంతో, ఈ మద్యం కుంభకోణంలో అసలు నిందితులకు త్వరలోనే చట్టపరమైన ట్రీట్మెంట్ ప్రారంభం కానుంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్న వైనం ఈ స్టేట్‌మెంట్‌తో స్పష్టంగా వెల్లడైంది.

# ఖైరతాబాద్ నుంచి జనసేన పోటీ...

హైదరాబాద్, హైకోర్టు తీర్పుతో దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటం, తెలంగాణ అసెంబ్లీ ఖైరతాబాద్ స్థానాన్ని ఖాళీగా ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఖైరతాబాద్ ఉపఎన్నిక అనివార్యమైంది. తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ క్రియాశీలక పాత్ర పోషిస్తామని, 2029 స్థానిక ఎన్నికలు, అసెంబ్లీ పోరులో గట్టిగా నిలబడతామని పవన్ కళ్యాణ్ ఇటీవల స్పష్టం చేశారు. తెలంగాణ సిద్ధాంతకర్తలు, విద్యార్థి సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తూ జనసేన పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. ఇలాంటి సమయంలో ఖైరతాబాద్ ఉపఎన్నిక రూపంలో జనసేనకు మొదటి అసలైన పరీక్ష ఎదురైంది. పార్టీని తెలంగాణలో సీరియస్‌గా తీసుకోవాలంటే ఖైరతాబాద్ బరిలో నిలవడం తప్పనిసరి. బరి నుంచి తప్పుకుంటే ఆంధ్రకే పరిమితమైన పార్టీ అనే ముద్రను కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు మరింత గట్టిగా వేసే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి అధికారంలో ఉన్నప్పటికీ, తెలంగాణ విషయంలో బీజేపీ శ్రేణులు ప్రత్యేక వ్యూహంతో ముందుకు వెళ్తున్నాయి. తెలంగాణ అసెంబ్లీ, ఉపఎన్నికల్లో ఎలాంటి పొత్తులు లేకుండా ఒంటరిగానే పోటీ చేస్తామని బిజెపి తెలంగాణ నాయకత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. గతంలో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల సమయంలో చివరి నిమిషంలో జనసేన తప్పుకుని బీజేపీకి మద్దతు ప్రకటించింది. కానీ ఈసారి కూడా అదే పునరావృతమైతే జనసేన ఇక్కడి క్షేత్రస్థాయి క్యాడర్‌ను తీవ్రంగా నిరాశపరిచినట్లవుతుంది. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నారు. ఖైరతాబాద్ బరిలో స్వయంగా అభ్యర్థిని దింపితే, బీజేపీతో గ్యాప్ వచ్చే ప్రమాదం ఉంది. పోనీ అభ్యర్థిని నిలబెట్టకుండా బీజేపీకి మద్దతు ప్రకటించి సైలెంట్ అయిపోదామంటే, పొత్తులు వద్దంటున్న బిజెపికే బలవంతంగా మద్దతు ఇస్తున్నారా అనే విమర్శలు ఇతర పార్టీల నుంచి వస్తాయి. అందువల్ల ఉపఎన్నికలో పోటీ చేయడం ద్వారా తెలంగాణలో తమ స్వతంత్ర ఉనికిని చాటుకోవాలా లేదా సంయమనం పాటించాలా అనే ధర్మసందేహంలో పవన్ కళ్యాణ్ ఉన్నారు. హైదరాబాద్ నగరంలో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడ ఆంధ్ర మూలాలు ఉన్న ఓటర్లు , అలాగే పవన్ కళ్యాణ్‌కు విశేషమైన అభిమాన గణం, యువత, బీసీ ఓటు బ్యాంకు గణనీయంగా ఉంది. పవన్ ప్రచారానికి వస్తే ఆ ప్రభావం ఖచ్చితంగా ఓట్లపై పడుతుంది. బిఆర్ఎస్, కాంగ్రెస్‌లపై అసంతృప్తిగా ఉండి, సాంప్రదాయకంగా బిజెపికి పడని ఓటర్లను ఆకర్షించే అవకాశం జనసేనకు ఉంది. ఖైరతాబాద్ వంటి కీలక స్థానంలో పోటీ చేయాలంటే కేవలం గ్లాస్ గుర్తు ఉంటే సరిపోదు.. గట్టి ఆర్థిక, అంగ బలం ఉన్న అభ్యర్థి కావాలి. స్థానికంగా బలం ఉన్న శ్రేణులను లేదా ఇతర పార్టీల నుంచి అసంతృప్త నేతలను ఆకర్షించి అభ్యర్థిగా నిలబెడితేనే పోరు ఆసక్తికరంగా మారుతుంది. ఒకవేళ క్యాండిడేట్‌ను నిలబెడితే, పవన్ కళ్యాణ్ వచ్చి స్వయంగా ప్రచారం చేయాల్సిందే. అలా చేయని పక్షంలో క్యాడర్‌కి తప్పుడు సంకేతాలు వెళ్తాయి. డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ కళ్యాణ్, తెలంగాణలో ప్రచారానికి వస్తే వచ్చే రాజకీయ పొలిటికల్ మైలేజ్ అంతాఇంతా కాదు. ఖైరతాబాద్ ఉపఎన్నిక ప్రకటనతో జనసేన ఒక కీలక మలుపు వద్ద నిలబడింది. పొత్తులతో సంబంధం లేకుండా పోటీ చేసి తమ నిజమైన ఓటు బ్యాంకు ఎంతో తేల్చుకోవడం ఒక మార్గమైతే, బీజేపీతో సామరస్యంగా చర్చించి ఏకాభిప్రాయానికి రావడం మరొక మార్గం. ఏది ఏమైనా, తెలంగాణలో తన 'సీరియస్‌నెస్'ను నిరూపించుకోవాలంటే పవన్ కళ్యాణ్ ఈ ఉపఎన్నికను తేలికగా తీసుకోలేరు. ఖైరతాబాద్ బరిలో జనసేన మార్క్ ఎలా ఉండబోతోందో రాబోయే కొన్ని రోజుల్లో తేలిపోనుంది.

# అమెరికాకు నో చెబుతున్న న్యూ ట్రెండ్

హైదరాబాద్, ఇంజినీరింగ్ పూర్తయిందంటే అమెరికాలో ఓఎస్.. ఆ తర్వాత అక్కడే ఉద్యోగం. ఇదే లక్ష్యంగా వేలాది మంది విద్యార్థులు భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి క్రమంగా మారుతోంది. అమెరికా వీసా నిబంధనల్లో మార్పులు, అక్కడి ఉద్యోగ మార్కెట్‌లో అనిశ్చితి, విదేశీ విద్యపై పెరుగుతున్న ఖర్చులు.. ఇవన్నీ విద్యార్థులను మరోసారి ఆలోచించేలా చేస్తున్నాయి. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కొంతకాలంగా కనిపిస్తున్న కొత్త ట్రెండ్ ఇదే. గతంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌ను ఒక ఆప్షన్‌గా మాత్రమే చూసిన విద్యార్థులు.. ఇప్పుడు దానినే మొదటి ప్రాధాన్యతగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికాలో ఓఎస్ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి వెళ్లడం కంటే.. స్వదేశంలోనే ఉద్యోగం సంపాదించి రెండుమూడేళ్లు అనుభవం పొందితే ఎలా ఉంటుందనే ఆలోచన పెరుగుతోంది. ముఖ్యంగా కుటుంబంపై భారీ ఆర్థిక భారం పడకుండా ఉండటం, ఉద్యోగ భద్రత ఉండటం విద్యార్థులను క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ వైపు మళ్లిస్తోంది. ఈ మార్పు విద్యార్థుల ఆలోచనల్లోనే కాదు.. ఇంజినీరింగ్ కాలేజీల్లోనూ కనిపిస్తోంది. గతంలో చివరి ఏడాదిలో ప్లేస్‌మెంట్ కోసం సిద్ధమయ్యే విద్యార్థులు.. ఇప్పుడు రెండో సంవత్సరం నుంచే కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ ప్రిపరేషన్‌పై దృష్టి పెడుతున్నారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లకు ముందుగానే రిజిస్టర్ చేసుకుంటున్నారు. విదేశీ విద్యకు వెళ్లే ముందు ఉద్యోగం దొరికితే.. ఆ తర్వాత పరిస్థితులను బట్టి తదుపరి నిర్ణయం తీసుకోవచ్చని భావిస్తున్నారు. విద్యార్థులు క్యాంపస్ ఉద్యోగాల వైపు మొగ్గుచూపుతున్నప్పటికీ.. రిక్రూట్‌మెంట్ మార్కెట్ మాత్రం అంత ఆశాజనకంగా కనిపించడం లేదు. గత మూడేళ్లలో అనేక కాలేజీల్లో క్యాంపస్‌కు వచ్చే కంపెనీల సంఖ్య తగ్గినట్లు విద్యాసంస్థలు చెబుతున్నాయి. ఒకప్పుడు కొన్ని కాలేజీలకు 50 నుంచి 80 వరకు కంపెనీలు వచ్చేవని, ప్రస్తుతం కొన్ని చోట్ల ఆ సంఖ్య 20 నుంచి 30కి పడిపోయిందని చెబుతున్నారు. దీంతో ఉద్యోగం కావాలనే డిమాండ్ పెరుగుతున్న సమయంలో.. ఉద్యోగ అవకాశాల సంఖ్య మాత్రం తగ్గడం విద్యార్థులకు మరో సవాలుగా మారుతోంది. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో మరో సమస్య కూడా విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తోంది. కొన్ని కంపెనీలు విద్యార్థులను ఎంపిక చేసి ఆఫర్ లెటర్లు ఇచ్చినప్పటికీ.. వెంటనే ఉద్యోగంలోకి తీసుకోకుండా నెలల తరబడి జాయినింగ్‌ను వాయిదా వేస్తున్న ఘటనలు కనిపిస్తున్నాయి. దీంతో ఉద్యోగం వచ్చిందనే సంతోషం ఉన్నా.. వాస్తవంగా ఎప్పుడు పని ప్రారంభిస్తామనే అనిశ్చితి విద్యార్థులను వెంటాడుతోంది. కొన్ని ప్రముఖ విద్యాసంస్థల్లోనూ ఇలాంటి ఆలస్యాలపై కంపెనీలకు సంబంధించి చర్యలు తీసుకున్న సందర్భాలు ఉండటం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. అయితే విద్యార్థులు పూర్తిగా అమెరికా కలను వదులుకున్నారని చెప్పలేం. విదేశాల్లో చదువుకోవాలనే ఆసక్తి ఇంకా ఉంది. కానీ 'ముందు ఉద్యోగం.. తర్వాత విదేశీ ప్రయాణం' అనే వ్యూహం మాత్రం బలపడుతోంది. ఇండియాలో రెండుమూడేళ్లు పనిచేసి అనుభవం సంపాదించిన తర్వాత అమెరికా లేదా ఇతర దేశాలకు వెళ్లాలని కొందరు విద్యార్థులు భావిస్తున్నారు. ప్రారంభంలో జీతం తక్కువగా ఉన్నా.. చేతిలో ఉద్యోగం, అనుభవం ఉండటం వల్ల భవిష్యత్ నిర్ణయాలు తీసుకోవడం సులభమవుతుందని వారు భావిస్తున్నారు. ఒకప్పుడు విదేశీ విద్య అంటే అధిక జీతం, అమెరికా ఉద్యోగం, సెటిల్‌మెంట్ అనే కల కనిపించేది. ఇప్పుడు విద్యార్థులు రిస్క్, ఖర్చు, వీసా, ఉద్యోగ భద్రత వంటి అంశాలను కూడా లెక్కలోకి తీసుకుంటున్నారు. అందుకే అమెరికా వెళ్లడమే కెరీర్ విజయానికి ఏకైక మార్గం కాదనే భావన బలపడుతోంది. స్వదేశంలోనే మొదటి ఉద్యోగం సంపాదించి.. నైపుణ్యాలు పెంచుకుని.. అనుభవంతో తర్వాత విదేశీ అవకాశాలను పరిశీలించడం కొత్త కెరీర్ వ్యూహంగా మారుతున్నట్లు కనిపిస్తోంది. మొత్తంగా చూస్తే.. అమెరికా కలకు పూర్తిగా తెరపడకపోయినా, ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రాధాన్యతలు మాత్రం మారుతున్నాయి. విదేశీ విద్య కోసం భారీ రిస్క్ తీసుకోవడం కంటే.. ముందుగా క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా కెరీర్‌కు బలమైన పునాది వేసుకోవడానికే కొత్త తరం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది.

# సిరిసిల్లలో రేవంత్ అసలు టార్గెట్ ఇదేనా? కేటీఆర్ కోటనే ఎందుకు ఎంచుకున్నారు?





హైదరాబాద్,తెలంగాణ రాజకీయం ప్రస్తుతం బీఆర్ఎస్ కీలక నాయకుల సొంత నియోజకవర్గాల చుట్టూ తిరుగుతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరుసగా నాలుగుసార్లు ప్రాతినిధ్యం వహించిన సిరిసిల్ల స్థానంలో సెప్టెంబర్ 30న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. సుమారు రూ. 1,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు రగుడు బైపాస్ వద్ద భారీ బహిరంగ సభను కాంగ్రెస్ ప్లాన్ చేసింది. పదేళ్ల పాలనలో కేటీఆర్ సిరిసిల్లను ఆదర్శంగా తీర్చిదిద్దామని చెప్పుకుంటుంటే, నాలుగుసార్లు గెలిపించిన ప్రజలకు సరైన అభివృద్ధి చేయలేదు అని రేవంత్ ప్రభుత్వం కౌంటర్ ఇస్తోంది. కేటీఆర్ గడపలోనే ఆయన వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా రాజకీయంగా మానసిక ఆధిపత్యం సాధించాలనేది కాంగ్రెస్ ప్రధాన వ్యూహం. సెప్టెంబర్ 30న సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించబోయే సభ సాధారణ ప్రభుత్వ కార్యక్రమంగానో లేదా పార్టీ సభగానో కాకుండా అంతకు మించి ఉండబోతోందన్న సంకేతం కనిపిస్తోంది. ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఇదే చర్చ కూడా. ఎందుకంటే రేవంత్ ఎంచుకున్నది సాధారణ నియోజకవర్గం కాదు. అది కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల. అక్కడే భారీ బహిరంగ సభ.. దానికి ముందు నాలుగు కిలోమీటర్ల రోడ్‌షో.. రాష్ట్రంలోని కీలక మంత్రులు, కాంగ్రెస్ నేతల మోహరింపు.. నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల నుంచి జన సమీకరణ.. ఇవన్నీ చూస్తే రేవంత్ పర్యటనను కేవలం అభివృద్ధి కార్యక్రమాల పర్యటన కాదు.. మరోవైపు బీఆర్ఎస్ కంచుకోటలో కాంగ్రెస్ రాజకీయ శక్తిని ప్రదర్శించడ కూడా ఈ సభలోని రెండు ప్రధాన లక్ష్యాలు. కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్లపై ప్రభుత్వం కీలక నిర్ణయం, వచ్చే ఏడాది నుంచి నీటి నిల్వరేవంత్‌కు సిరిసిల్లలో ఒక ప్రత్యేక రాజకీయ లెక్క ఉంది. కేటీఆర్‌కు ఇది కేవలం ఎమ్మెల్యే నియోజకవర్గం కాదు. 2009, 2014, 2018, 2023 ఎన్నికల వరకు సిరిసిల్లలో కేటీఆర్ వరుస విజయాలు సాధించారు. అంటే సిరిసిల్లలో కేటీఆర్ అజేయుడు కాదనే పొలిటికల్ నరేటివ్ సృష్టించడం రేవంత్ ముఖ్య వ్యూహం కావచ్చు. రాజకీయాల్లో ప్రత్యర్థి బలహీనంగా ఉన్న చోట బలం చూపించడం పెద్ద విషయం

కాదు. ప్రత్యర్థి బలమైన చోటికి వెళ్లి బలం చూపించడమే పెద్ద మెసేజ్ ఇస్తుంది. రేవంత్ సిరిసిల్ల ద్వారా అదే సందేశాన్ని ఇవ్వాలని చూస్తున్నారా? అనేది ఇప్పుడు ఆసక్తికరమైన ప్రశ్న.సిరిసిల్ల సభను కేవలం రేవంత్ వర్సెస్ కేటీఆర్గా చూడటం ఈ వ్యూహాన్ని చిన్నదిగా చూసినట్టే. రేవంత్ లక్ష్యం బీఆర్ఎస్ రాజకీయ మానసిక ఆధిక్యాన్ని సవాలు చేయడం కావచ్చు. కేటీఆర్ సిరిసిల్లలో గెలవడం ఒక ఎన్నికల ఫలితం.కానీ "కేటీఆర్ అంటే సిరిసిల్ల.. సిరిసిల్ల అంటే కేటీఆర్" అనే రాజకీయ ఇమేజ్‌ను మార్చడం మాత్రం చాలా పెద్ద రాజకీయ విజయం అవుతుంది. అందుకే సభకు వచ్చే జనసందోహం, రోడ్‌షోలో కనిపించే స్పందన, స్థానిక నేతల పాల్గొనడం, కేటీఆర్‌పై రేవంత్ చేసే రాజకీయ దాడి కంటే కూడా సిరిసిల్ల ప్రజల్లో కాంగ్రెస్‌కు పొలిటికల్ స్పేస్ ఎంత? అన్నదే కాంగ్రెస్‌కు ముఖ్యమైన కొలమానం.ఇక్కడ మరో కీలక అంశం ఉంది. సిరిసిల్ల సభను కాంగ్రెస్ ఒక నియోజకవర్గ కార్యక్రమంగా కాకుండా రాష్ట్రస్థాయి పవర్ షోగా మలచడానికి ప్రయత్నిస్తోంది. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. నాలుగు కిలోమీటర్ల రోడ్‌షోతో పాటు భారీ జన సమీకరణకు కాంగ్రెస్ సన్నాహాలు చేస్తోంది.అంటే ''కేటీఆర్‌ను ఓడించగలమా అన్నదానికంటే ముందుగా..''కేటీఆర్ కోటలో కాంగ్రెస్ ఎంత పెద్ద రాజకీయ శక్తిగా కనిపించగలదు? అన్న ప్రశ్నకు సమాధానం చూపించాల్సిన వేదికగా సిరిసిల్లను మలుస్తున్నట్టు కనిపిస్తోంది.ఈ వ్యూహం ఒక్కరోజులో పుట్టింది కాదు. సెప్టెంబర్ 5న నకిరేకల్ సభలోనే రేవంత్‌రెడ్డి సిరిసిల్ల, సిద్ధిపేట, గజ్వేల్‌లను ప్రస్తావించారు. సిరిసిల్లలో కేటీఆర్‌ను, సిద్ధిపేటలో హరీశ్‌రావును, గజ్వేల్‌లో కేసీఆర్‌ను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. సిరిసిల్లకు సెప్టెంబర్‌లో, సిద్ధిపేటకు అక్టోబర్‌లో వెళ్తానని చెప్పారు. అంటే సిరిసిల్ల ఒక టెస్ట్ కేసు.ఇక్కడ కాంగ్రెస్ నిర్వహించే సభకు వచ్చే స్పందన ఎలా ఉంటుంది? స్థానిక కాంగ్రెస్ నాయకత్వం ఎంతవరకు సమన్వయంతో పనిచేస్తుంది? కేటీఆర్‌కు వ్యతిరేకంగా ఉన్న స్థానిక అసంతృప్తిని కాంగ్రెస్ ఎంతవరకు రాజకీయంగా ఉపయోగించుకోగలదు? ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు ఎంతవరకు కనెక్ట్ చేయగలదు? ఈ ప్రశ్నలకు సిరిసిల్లలో రేవంత్‌కు వచ్చే సమాధానం తర్వాతి అడుగులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.రేవంత్ సిరిసిల్ల, సిద్ధిపేట, గజ్వేల్ సభల ద్వారా మూడు రాజకీయ సందేశాలను పంపాలనుకుంటున్నారు.

1. బీఆర్ఎస్ కోటల్లోకీ కాంగ్రెస్ వస్తుంది, ఇది కేటీఆర్‌కు మాత్రమే కాదు.. బీఆర్ఎస్ కేడర్‌కు కూడా ఇచ్చే సందేశంగా చూడొచ్చు.

2. కాంగ్రెస్ కేవలం అధికారంలో ఉన్న పార్టీ కాదు.. ఎన్నికల మోడ్‌లో ఉన్న పార్టీ అని చెప్పడం అది పార్టీ కేడర్‌కు కూడా ఒక మెసేజ్ ఇస్తుంది.

3. బీఆర్ఎస్ పునరాగమనానికి అవకాశం లేదన్న నరేటివ్ సృష్టించడం. ఇక్కడే సిరిసిల్ల సభ మరింత ఆసక్తికరంగా మారింది. పైగా ఇప్పుడు ఏం చేస్తారన్నది ఆసక్తిగా మారింది. రేవంత్ "నేను నీ కోటలోకి వస్తున్నా" అనే రాజకీయ సందేశం ఇవ్వబోతుంటే.. కేటీఆర్ మాత్రం "వస్తున్నారు కదా.. మా ప్రశ్నలకు సమాధానం చెప్పండి" అంటూ చర్చను మరో ట్రాక్‌లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. సెప్టెంబర్ 27న కేటీఆర్ రేవంత్‌కు బహిరంగ లేఖ రాశారు. 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలపై ఆధారాలు ముందు పెట్టాలని కోరారు. అక్కడితో ఆగలేదు. సిరిసిల్ల నేతన్నలకు కోట్ల రూపాయల బకాయిలు, యార్న్ సబ్సిడీ, నేతన్న బీమా, వీవింగ్ పార్క్, రైతు భరోసా, రుణమాఫీ తదితర అంశాలపై కూడా సీఎం సమాధానం చెప్పాలని కోరారు. అంటే ఇప్పుడు రేవంత్ ముందున్న రాజకీయ సవాలు కొంత మారింది.ఇక్కడే సెప్టెంబర్ 30 ప్రసంగం కీలకంగా

మారనుంది. రేవంత్ కేవలం “కేటీఆర్ ఓడిపోతారు” అని మాట్లాడితే అది సాధారణ రాజకీయ విమర్శగా మిగిలిపోవచ్చు. 2014 నుంచి 2023 వరకు కేసీఆర్ ప్రభుత్వంలో నిధులన్నీ గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలకే వెళ్లాయి.. అభివృద్ధి అంటే ఈ మూడు నియోజకవర్గాలేనా అన్న ప్రశ్న ఎదురైంది. అలాంటి పరిస్తితుల్లో రేవంత్ అక్కడికెళ్లి స్దానికులకు కొత్తగా ఏం హామీలివ్వగలరు. కానీ సిరిసిల్లకు సంబంధించిన స్పష్టమైన లెక్కలు చెబితే? ఎన్ని పనులు చేశాం? ఎన్ని నిధులు ఇచ్చాం?ఏ ప్రాజెక్టుకు ఎంత ఖర్చు చేశాం? నేతన్నలకు ప్రభుత్వం ఏం చేసింది? రాబోయే రోజుల్లో ఏం చేయబోతున్నాం? ఇలా సిరిసిల్లకే ప్రత్యేకమైన లెక్కలతో మాట్లాడితే సభకు వేరే రాజకీయ బలం వస్తుంది. అందుకే రేవంత్ ప్రసంగంలోని రాజకీయ పంచ్‌లపై మాత్రమే కాదు.. ఆయన చెప్పబోయే సిరిసిల్ల స్పెసిఫిక్ డేటాపైనా ఇప్పుడు అందరి దృష్టి ఉంది.ఇది బహుశా మొత్తం వ్యూహంలో అత్యంత ముఖ్యమైన అంశం. ఈ మూడు నియోజకవర్గాలు ఒకే రాజకీయ కుటుంబం, ఒకే పార్టీ అగ్రనాయకత్వంతో బలంగా అనుసంధానమై ఉన్నాయి. అందుకే రేవంత్ ఈ మూడు ప్రాంతాల్లో వరుసగా రాజకీయ కార్యక్రమాలు నిర్వహిస్తే అది కేవలం నియోజకవర్గాల పర్యటన కాదు. బీఆర్ఎస్ రాజకీయ కేంద్రాల చుట్టూ కాంగ్రెస్ తన రాజకీయ కథనాన్ని నిర్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటి వరకు తెలంగాణ రాజకీయ చర్చలో ప్రధాన ప్రశ్న “కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది?” అని రేవంత్ సిరిసిల్ల-సిద్ధిపేట వ్యూహం ఆ చర్చను మరో ప్రశ్నవైపు తిప్పాలనుకుంటున్నారు. “2028లో బీఆర్ఎస్ తిరిగి వస్తుందా?” లేదా “కాంగ్రెస్ బీఆర్ఎస్ బలమైన కోటలను కూడా బద్దలు కొట్టగలదా?” ఇది కాంగ్రెస్‌కు అనుకూలమైన చర్చగా మారుతుందా, బీఆర్ఎస్‌కు రాజకీయంగా ఉపయోగపడుతుందా అన్నది భవిష్యత్ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. రెండు పార్టీల మధ్య 2028 పోటీకి దేఖ్ లేంగే నినాదం మాత్రం మొదలైంది. ఈ ప్రశ్నకు సమాధానం ఈ వరుస సమావేశాలు చేప్తాయి.. వేలకోట్ల నిధులతో అభివృద్ధి చేసిన నియోజకవర్గాల్లో రేవంత్ స్థానికంగా ఎంత బల ప్రదర్శన చేయగలరు. వాటి ప్రభావంతో ఆయా నియోజకవర్గాల్లో బీఆరెస్ స్థైర్యాన్ని దెబ్బతీయగలరా. భారీ జనసమీకరణ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలకు నూతన ఉత్సాహాన్ని నింపగలరా అనేది ఈ సభల విజయాపజయాలు నిర్ణయించనుంది. మొత్తానికి దూకుడుకు మారు పేరైన రేవంత్ రాజకీయ వ్యూహాలు ఈ కొత్త దూకుడుతో ఏం చేస్తారో చూడాలి.





# బాక్సాఫీస్ వద్ద నష్టాలు.. స్కామ్...

హైదరాబాద్, జనసమయం: సినిమాకి బ్లాక్‌బస్టర్ టాక్ వస్తుంది.. జనం కూడా థియేటర్లకు బాగానే వస్తున్నారని టాక్ నడుస్తుంది.. కానీ కట్ చేస్తే ప్రొడ్యూసర్ చేతికి వచ్చేసరికి వసూళ్లు సున్నా! హిట్ సినిమా అని సంబరపడాలో.. బాక్సాఫీస్ వద్ద నష్టాలు చూసి ఏడవాలో అర్థంకాని పరిస్థితి. అసలు టాలీవుడ్‌కి ఏమైంది? పెద్ద సినిమాలు కూడా థియేటర్లలో ఎందుకు దారుణంగా దెబ్బతింటున్నాయి? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పే ఒక సంచలన వాస్తవం ఇప్పుడు బయటపడింది!ఇది రాయలసీమలోని ఒక చిన్న పట్టణంలో జరిగిన ఒక యథార్థ సంఘటన. ఒకప్పుడు ఆ ఊరిలో పది సినిమా థియేటర్లు కలకలలాడేవి. కానీ కాలక్రమేణా పరిస్థితులు మారిపోయాయి.. ఇప్పుడు కేవలం మూడు థియేటర్లు మాత్రమే మిగిలాయి. అందులో ఒక థియేటర్‌ను టాలీవుడ్‌లోని ఒక అగ్ర నిర్మాణ, డిస్ట్రిబ్యూషన్ సంస్థ లీజుకు తీసుకుని నడుపుతోంది. ఇటీవల మంచి హిట్ టాక్ తెచ్చుకున్న 'ఇరుముడి' సినిమా అక్కడ ప్రదర్శించబడింది. జనాలు కూడా థియేటర్‌కి వచ్చి సినిమా బాగానే చూశారు. సరే, అసలు మ్యాటర్ ఇక్కడే మొదలైంది!ఈ నెల 18న ఆ సినిమా ఓటీటీలోకి వస్తోంది. అంటే కేవలం రెండ్రోజుల ముందు.. 16వ తేదీ సాయంత్రం ఫస్ట్ షో! సాధారణంగా ఓటీటీలో వచ్చేస్తుందిలే అని జనాలు థియేటర్‌కి రావడం తగ్గిస్తారు. కానీ ఆ రోజు ఫస్ట్ షోకి 100 మందికి పైగా ప్రేక్షకులు వచ్చారు.. అందులో మహిళలే ఎక్కువ! కానీ అక్కడ ఒక వింత జరిగింది! వచ్చిన జనం 100 మంది అయితే.. కౌంటర్‌లో తెగిన టికెట్లు మాత్రం కేవలం 50 మాత్రమే!అవును, మీరు విన్నది నిజమే! డబ్బులు నగదు రూపంలో ఇచ్చినా.. లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో పే చేసినా.. సగం మందికి టికెట్ ఇవ్వలేదు.. "డబ్బులొచ్చాయి.. సీటు నెంబర్ ఇది.. వెళ్లి కూర్చోండి" అని లోపలికి పంపించేశారు. అమాయక జనం కూడా టికెట్ ఉంటే ఏంటి లేకపోతే ఏంటి అని వెళ్లి సినిమా చూసేశారు.ఇప్పుడు అసలైన ప్రశ్నేంటంటే.. ఈ డబ్బులంతా ఎక్కడికి పోతున్నాయి? టికెట్ కౌంటర్‌లో ఉండే వ్యక్తి, గేటు దగ్గర నిలబడే వ్యక్తి కలిసి ఈ సొమ్మును కాజేస్తున్నారా? థియేటర్‌ను లీజుకు తీసుకున్న ఆ పెద్ద సంస్థను మోసం చేస్తున్నారా? అలా అనుకుంటే పప్పులో కాలేసినట్టే.. ఎందుకంటే ఆ డిస్ట్రిబ్యూషన్ సంస్థ చిన్నదేమీ కాదు. ఇండస్ట్రీలో ఎన్నో ఏళ్ల అనుభవం ఉన్న అగ్ర సంస్థ.. పైగా లెక్కల విషయంలో చాలా నిక్కచ్చిగా ఉంటుంది. సిబ్బందిపై వేయి కళ్లు వేసి నిఘా ఉంచగల వ్యవస్థ వారికుంది. అలాంటప్పుడు చిన్న ఉద్యోగులు సంస్థను మోసం చేయడం సాధ్యమయ్యే పనేనా?అంటే.. ఇక్కడ జరుగుతున్నది ఏంటి? టికెట్లు అమ్ముడవుతున్నా.. ఆ కాసుల లెక్కలను మాత్రం అధికారికంగా చూపించకుండా థియేటర్ యాజమాన్యాలు, డిస్ట్రిబ్యూషన్ సంస్థలు కలిసి అసలు నిర్మాతను మోసం చేస్తున్నాయా? మైత్రి మూవీ మేకర్స్ వంటి దిగ్గజ నిర్మాణ సంస్థలకే ఇలాంటి దెబ్బలు తగులుతుంటే.. ఇక వీళ్లను నమ్మి చిన్న నిర్మాతలు తమ సినిమాలను డిస్ట్రిబ్యూషన్‌కు ఇస్తే ఏమవ్వాలి? సొంతం దివాలా తీయడం తప్ప వేరే దారి ఉందా? బాక్సాఫీస్ వద్ద 'హిట్' అని బోర్డులు కనిపిస్తున్నా, కలెక్షన్ల గల్లాపెట్టె ఖాళీగా ఉండటానికి ఇదొక ప్రధాన కారణం కాదా?ఇలాంటి అక్రమాలు జరుగుతున్నంత కాలం.. థియేట్రికల్ రిలీజ్ అనేది నిర్మాతలకు ఒక పెద్ద జూదంగానే మిగిలిపోతుంది. దీనిపై మీ అభిప్రాయం ఏంటి? థియేటర్లలో జరుగుతున్న ఈ టికెట్ గోల్‌మాల్‌పై మీ అనుభవాలను కింద కామెంట్ బాక్స్‌లో షేర్ చేయండి.

# ఎయిర్ పోర్టు క్రెడిట్ కోసం రేవంత్



వరంగల్ ,జనసమయం: తెలంగాణ సంస్కృతికి, పోరాటాల చరిత్రకు వరంగల్ జిల్లా గుండెకాయ లాంటిది. ఓరుగల్లు మట్టికి ఉన్న రాజకీయ, భావోద్వేగ ప్రాముఖ్యత హైదరాబాద్‌ను మించి ఉంటుంది. అలాంటి చారిత్రాత్మక వరంగల్‌లోని దశాబ్దాల కల అయిన మామునూరు ఎయిర్‌పోర్ట్ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వ్యూహం ప్రత్యేకమైనది. ఎయిర్‌పోర్ట్ రన్ వేలు, టెర్మినల్ భవనాల నిర్మాణం ఇంకా తొలి దశలోనే ఉన్నప్పటికీ.. ఈ కొత్త ఎయిర్‌పోర్ట్‌కు ఏ పేరు పెడితే బాగుంటుంది? మీ సూచనలు తెలపండి అంటూ సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా వేసిన ఒకే ఒక్క ప్రశ్న ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎమోషనల్ అండ్ పొలిటికల్ డిబేట్‌గా మారింది.కార్యరూపంలో ఒక పనిని పూర్తి చేయడం ఒకెత్తయితే, దాని నుంచి గరిష్ట రాజకీయ ప్రయోజనాన్ని, క్రెడిట్ ను తమ ఖాతాలో వేసుకోవడం మరొక ఎత్తు. ఈ విషయంలో రేవంత్ రెడ్డి అందరికంటే రెండు అడుగులు ముందే ఉన్నారని చెప్పవచ్చు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మామునూరు ఎయిర్‌పోర్టుకు భూసేకరణ జరగలేదని, బీఆర్ఎస్ నేతలు కేవలం ఫామ్‌హౌస్‌లకే ప్రాధాన్యమిచ్చారని విమర్శిస్తూనే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ. 295 కోట్ల నిధులు కేటాయించి, 280 ఎకరాల భూసేకరణ పూర్తి చేసి ఏఏఐ కి అప్పగించిన విషయాన్ని రేవంత్ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. టెండర్ల ప్రక్రియ రూ. 213 కోట్లతో ప్రారంభమైన వెంటనే 'పేరు సూచించండి' అని పిలుపునివ్వడం ద్వారా ప్రాజెక్ట్ సాధన క్రెడిట్ మొత్తాన్ని తన ఖాతాలోకి లాక్కోగలిగారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం తర్వాత తెలంగాణలో ప్రస్తుతం మరే ఇతర రవాణా ఎయిర్‌పోర్ట్ లేకపోవడం వల్ల.. ఉత్తర తెలంగాణకు వరంగల్ ఎయిర్‌పోర్టే ఏకైక లైఫ్‌లైన్‌గా మారబోతోంది. ఇది కేవలం రవాణా సౌకర్యం మాత్రమే కాదు; కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఐటీ రంగాలు, రామప్ప దేవాలయం, వెయ్యి స్తంభాల గుడి వంటి పర్యాటక ప్రాంతాలకు ఒక న్యూ గ్లోబల్ గేట్‌వే అని చాటిచెప్పడం ద్వారా రేవంత్ ఓరుగల్లు ప్రజల ఆకాంక్షను తట్టారు. ఈ 'నేమ్ గేమ్' పిలుపునకు సోషల్ మీడియా నుంచి, సినీ రంగానికి చెందిన ప్రముఖుల నుంచి అనూహ్యమైన స్పందన లభించింది. వరంగల్‌కు చెందిన ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా స్పందిస్తూ రుద్రమ అంతర్జాతీయ విమానాశ్రయం లేదా కాకతీయ అంతర్జాతీయ విమానాశ్రయం అనే పేర్లను సూచించగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సమ్మక్క-సారలమ్మ , నటుడు విజయ్ దేవరకొండ, బండ్ల గణేష్, ఇతర నేతలు కాకతీయ , పి.వి. నరసింహారావు , 'చాకలి ఐలమ్మ వంటి చారిత్రాత్మక పేర్లను లేవనెత్తారు. సందీప్ వంగాకు రేవంత్ ఇచ్చిన దట్స్ ది స్పిరిట్ రిప్లై కూడా సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యింది.దీని ద్వారా రేవంత్ సాధించిన రాజకీయ ప్రయోజనం ఏంటంటే.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పూర్తయి

అందుబాటులోకి రావడానికి కనీసం మరో రెండేళ్లు సమయం పడుతుంది. కానీ, ఈ పేరు చుట్టూ నడిచే చర్చ వల్ల వరంగల్, కరీంనగర్, ఖమ్మం వంటి కీలక జిల్లాల ప్రజల మనస్సులో మామునూరు ఎయిర్‌పోర్టును మళ్లీ ట్రాక్‌పైకి తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే.. రేవంత్ రెడ్డి చొరవతోనే ఇది సాధ్యమైంది అనే బలమైన ముద్ర పడింది. నిర్మాణం పూర్తికాకముందే ఎమోషనల్ కనెక్ట్‌ను క్రియేట్ చేయడంలో సీఎం సక్సెస్ అయ్యారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ దీనిపై ఎంతగా ఎదురుదాడి చేయాలని చూసినా, భూసేకరణ పూర్తికావడం, ఆంక్షల క్లియరెన్స్ సాధించడం, టెండర్లు పడటం వంటి సాంకేతిక ఆధారాలు కాంగ్రెస్ వైపే ఉన్నాయి. ఎయిర్‌పోర్ట్ పేరుపై చర్చ పెట్టడం ద్వారా తెలంగాణ మూలాలను, ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తున్నారనే భావన కల్పిస్తూనే.. రాబోయే రోజుల్లో వరంగల్‌లో కాంగ్రెస్ తన రాజకీయ పట్టును మరింత పటిష్టం చేసుకునే దిశగా సీఎం రేవంత్ రెడ్డి తెలివైన పావును కదిపారని భావిస్తున్నారు.

# ఆయుర్వేదానికి పూర్వ వైభవం

హైదరాబాద్,:ప్రాచీన భారతీయ వైద్య విధానమైన ఆయుర్వేదానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పూర్వ వైభవం తీసుకొస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. నాంపల్లిలోని ఫ్యాప్సీ భవన్‌లో బీజేపీ మెడికల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ ఆయుర్వేద డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. ఆయుర్వేదం భారతదేశ ప్రాచీన వైద్య సంప్రదాయమని పేర్కొన్నారు. గతంలో దేశాన్ని పాలించిన మొఘులులు, బ్రిటిష్ పాలకులు ఆయుర్వేద వైద్య విధానాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. అయితే ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో ఆయుర్వేదానికి దేశవ్యాప్తంగా గుర్తింపు పెరుగుతోందని తెలిపారు. ఆయుర్వేద వైద్యం ద్వారా అనేక దీర్ఘకాలిక వ్యాధులకు ఉపశమనం లభిస్తోందని రామచందర్‌రావు పేర్కొన్నారు. ప్రజలకు ఆయుర్వేదంపై మరింత అవగాహన కల్పించడంతోపాటు, సంప్రదాయ వైద్య విధానాలను ఆధునిక పరిశోధనలతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశం నుంచి ఆయుర్వేద ఉత్పత్తుల ఎగుమతులు 20 శాతం పెరిగినట్లు ఆయన



గుర్తుచేశారు. ఆయుర్వేద వైద్య విధానం, ఔషధ ఉత్పత్తుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఈ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తోందన్నారు. అనంతరం ఆయుర్వేద రంగంలో విశేష సేవలందిస్తున్న పలువురు వైద్యులను రామచందర్‌రావు ఘనంగా సన్మానించారు.

# ఆయిల్ పామ్ రైతుల నోట్లో మట్టి కొట్టేలా కేంద్ర నిర్ణయం : మంత్రి తుమ్మల

-రైతులను ఆయిల్ పామ్ వైపు ప్రోత్సహిస్తూ.. అదే రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే విధానాలు ఎందుకు?

**-దిగుమతి సుంకం తగ్గింపుతో దేశీయ ఆయిల్ పామ్ రైతులకు ధరలపై ఒత్తిడి పడే అవకాశం.**

**-రాష్ట్రం 44 శాతం దిగుమతి సుంకం కోరుతుంటే.. కేంద్రం 16.5 శాతం నుంచి 11 శాతానికి తగ్గించింది.**

**-కేంద్ర నిర్ణయం ఆయిల్ పామ్ రైతుల్లో అనిశ్చితిని పెంచే అవకాశం .**

**-దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే పునరాలోచించాలి.**

**-రైతులను ఆయిల్ పామ్ వైపు మళ్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు.**

**-రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు కేంద్ర దిగుమతి సుంకం తగ్గింపు ప్రతికూలంగా మారే అవకాశం.**

హైదరాబాద్,ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ముడి పామాయిల్ దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయంపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి  తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు దేశంలో ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని, రైతులను ఈ పంట వైపు మళ్లించాలని రాష్ట్రాలకు సూచిస్తూ.. మరోవైపు విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పామాయిల్‌పై సుంకాన్ని తగ్గించడం కేంద్ర ప్రభుత్వ ద్వంద వైఖరికి నిదర్శనమని మంత్రి మండిపడ్డారు.“రైతును ఆయిల్ పామ్ సాగు చేయమని ప్రోత్సహిస్తారు.. కానీ రైతు పండించిన గెలలకు గిట్టుబాటు ధర వచ్చే పరిస్థితులను మాత్రం కేంద్రం దెబ్బతీస్తోంది. ఒక చేత్తో రైతును ఆయిల్ పామ్ వైపు నడిపిస్తూ.. మరో చేత్తో దిగుమతి సుంకం తగ్గించి విదేశీ పామాయిల్‌కు మార్కెట్‌ను సులభతరం చేయడం ఏ విధమైన రైతు అనుకూల విధానం?” అని మంత్రి ప్రశ్నించారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో క్రూడ్ పామ్ ఆయిల్‌పై మొత్తం దిగుమతి సుంకం 16.5 శాతం నుంచి 11 శాతానికి తగ్గింది. దీంతో దిగుమతి చేసుకునే పామాయిల్‌కు పోటీ ప్రయోజనం పెరిగి, దేశీయంగా ఆయిల్ పామ్ గెలల ధరలపై ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉ



ందని మంత్రి తెలిపారు.“తెలంగాణ ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి దిగుమతి సుంకాన్ని పెంచాలని కోరుతున్న సమయంలో కేంద్రం సుంకాన్ని తగ్గించడం బాధ్యతారాహిత్యమైన నిర్ణయం. రైతులకు ధర భరోసా కల్పించాల్సిన సమయంలో విదేశీ దిగుమతులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం ద్వారా కేంద్రం ఎవరికి ప్రయోజనం కల్పించాలనుకుంటోంది?” అని తుమ్మల ప్రశ్నించారు.ఆయిల్ పామ్ అనేది సాధారణంగా ఒక సీజన్‌లో పండించి విక్రయించే పంట కాదని, రైతు సంవత్సరాల పాటు పెట్టుబడి పెట్టి, నీరు, ఎరువులు, నిర్వహణ ఖర్చులు భరిస్తూ సాగు చేసే దీర్ఘకాలిక పంట అని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి పంటకు మార్కెట్ ధరపై విధానపరమైన స్థిరత్వం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర

ప్రభుత్వంపై ఉందన్నారు. "ఈరోజు మొక్క నాటిన రైతు రేపే పంట అమ్మడు. సంవత్సరాల పాటు పెట్టుబడి పెట్టిన తర్వాత మార్కెట్ విధానాలను మార్చేస్తే నష్టపోయేది రైతే. రైతుకు ధర భరోసా ఇవ్వకుండా, దిగుమతులకు 92తలుపులు మరింత విస్తరించడం రైతు ప్రయోజనాలకు విరుద్ధం" అని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును రాష్ట్రంలో పెద్ద ఎత్తున విస్తరిస్తోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 3.20 లక్షల ఎకరాల్లో 88 వేలకుపైగా రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని, దేశంలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణంలో తెలంగాణ ముందంజలో ఉందని తెలిపారు. రైతులను ఆయిల్ పామ్ వైపు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి రాయితీలు, నాట్ల విస్తరణ, డ్రిప్ ఇరిగేషన్, మౌలిక సదుపాయాలు, ప్రాసెసింగ్ యూనిట్లు, రిఫైనరీలు వంటి అనేక చర్యలు చేపడుతోందని మంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఔఓఇూ–ూఖ ద్వారా దేశీయ ఆయిల్ పామ్ ఉత్పత్తిని పెంచి, వంట నూనెల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడమే లక్ష్యంగా ప్రకటించింది. "కేంద్రం ప్రకటించే లక్ష్యాలు ఒకలా.. అమలు చేసే విధానాలు మరోలా ఉంటే రైతు ఎలా నమ్మకం పెంచుకుంటాడు? ఆయిల్ పామ్ సాగు విస్తరణ కోసం రాష్ట్రాలు, రైతులు పెట్టుబడులు పెట్టిన తర్వాత దిగుమతి సుంకం వంటి కీలక విధానాలను మార్చడం వల్ల రైతుల్లో నమ్మకం దెబ్బతింటుంది" అని తుమ్మల అన్నారు. ఆయిల్ పామ్ రైతుల దీర్ఘకాలిక డిమాండ్ అయిన తాజా ఆయిల్ పామ్ గెలలకు (ఈఈః) టన్నుకు రూ. 25,000 కనీస హామీ ధర కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఈఈః ధర ప్రభుత్వం నిర్ణయించే విధానం ప్రకారం అమలవుతోందని, రైతులకు మరింత స్థిరమైన ధర భరోసా అవసరమని పేర్కొన్నారు. "రైతు ఆదాయం పెంచుతామని చెప్పే కేంద్ర ప్రభుత్వం ముందుగా రైతు పండించిన పంటకు ధర భరోసా కల్పించాలి. విదేశీ దిగుమతులపై ఆధారపడే విధానాన్ని ప్రోత్సహిస్తూ దేశీయ రైతు ఉత్పత్తికి ధర లేకుండా చేయడం ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తికే విరుద్ధం" అని మంత్రి అన్నారు.

భారత్ తన వంట నూనెల అవసరాల్లో పెద్ద భాగాన్ని దిగుమతుల ద్వారా తీర్చుకుంటున్న నేపథ్యంలో, దేశీయ ఆయిల్ పామ్ సాగును బలోపేతం చేయడం కేవలం రైతు సంక్షేమానికే కాకుండా దేశ ఆహార, వ్యవసాయ భద్రతకు కూడా కీలకమని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ తన వెజిటబుల్ ఆయిల్ అవసరాల్లో సుమారు మూడింట రెండొంతులు దిగుమతులపై ఆధారపడుతున్నట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. "ఆత్మనిర్భర్ భారత్ అంటే విదేశీ దిగుమతులపై ఆధారపడటం కాదు.. దేశ రైతు ఉత్పత్తి చేసే నూనెను పెంచడం. రైతును బలోపేతం చేయకుండా దిగుమతులను చౌక చేయడం ద్వారా దేశం ఆత్మనిర్భర్ కాదు. దేశీయ రైతు నిలబడితేనే దేశం నిలబడుతుంది" అని తుమ్మల స్పష్టం చేశారు. తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి కేంద్రం సహకరించాల్సింది పోయి, రైతుల్లో అనిశ్చితి కలిగించే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. "తెలంగాణ రైతులు నమ్మకంతో ఆయిల్ పామ్ సాగులోకి వచ్చారు. ఆ నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. రైతు ప్రయోజనాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం రాజీ పడదు. కేంద్రం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించి, దేశీయ ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించే విధానాన్ని తీసుకురావాలి" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని తక్షణమే పునఃసమీక్షించాలని, దేశీయ ఆయిల్ పామ్ రైతులకు ధర భరోసా కల్పించేలా కేంద్రం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని, లేని పక్షంలో ఈఈఃలకు టన్నుకు రూ. 25,000 కనీస హామీ ధర కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బాలయ్య.. ప్రభాస్ స్టార్ వార్ తో...

## అమెరికాను కాలకేయులతో పోల్చి 'బాహుబలి'తో ఇరాన్ వార్నింగ్



హైదరాబాద్, పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య జరుగుతోన్న యుద్ధం ఏడు నెలలు పూర్తి చేసుకుంది. ఇరు దేశాలూ పరస్పరం బాంబులు, యుద్ధ విమానాలు, క్షిపణులతో దాడులు చేసుకుంటున్నాయి. ఇదే సమయంలో సోషల్ మీడియాలోనూ మీమ్స్‌తో హోరెత్తిస్తున్నాయి. ఈ విషయంలో ఇరాన్ ఒక అడుగు ముందుకేసింది. భారతీయ సినిమాలతో ముఖ్యంగా టాలీవుడ్ చిత్రాల్లో యాక్షన్ సీన్లతో అమెరికాకు వార్నింగ్‌లు ఇస్తోంది. తాజాగా, దర్శక ధీరుడు రాజమౌళి తెరకెక్కించిన ఎపిక్ బాహుబలి వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. అమెరికాతో మీమ్స్ యుద్ధంలో టాలీవుడ్ సినిమా క్లిప్పింగులను ఇరాన్ తెగ వాడేస్తోంది. ఇటీవల నందమూరి బాలకృష్ణ సినిమా 'భగవంత్ కేసరి'లోని యాక్షన్ సీన్ క్లిప్పింగ్‌తో అగ్రరాజ్యానికి జింబాబ్వేలోని ఇరాన్ రాయబార కార్యాలయం వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా, ప్రభాస్ నటించిన బాహుబలి సినిమాలోని వీడియో క్లిప్‌తో అమెరికాకు కౌంటర్ ఇవ్వడం విశేషం. హైదరాబాద్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం.. కాలకేయులతో బాహుబలి యుద్ధం చేస్తున్న దృశ్యాలను పోస్ట్ చేసింది. తాము ఎవ్వరికీ తలవంచబోమని, కాలకేయులతో బాహుబలి పోరాడినట్టు తాము కూడా మాతృదేశం కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమని స్పష్టం చేసింది.'మేం ఎవ్వరికీ తలవంచబోమని మా అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఐకరాజ్యసమితి సాధారణ సభ సమావేశంలో కుండబద్దలు కొట్టారు.. కాలకేయులకు ఎదురొడ్డి బాహుబలి యుద్ధం చేసినట్టే.. మేం కూడా మా మాతృదేశం కోసం రక్తాన్ని చిందించి ప్రాణత్యాగానికైనా సిద్ధపడతాం" అని ఎంబసీ పేర్కొంది. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఓ షియా ముస్లిం దేశం హిందూ దేవతను పూజించడంపై పోస్ట్ పెట్టడం నిజంగా గ్రేట్' అని పోస్ట్‌పై ఓ నెటిజన్ కామెంట్ చేశాడు. "తెలుగు మీమ్స్‌తో షియా దేశం... నేను షియాని, మా పూర్వీకులు బలూచిస్థాన్‌కు చెందినవారు, ఇప్పుడు మేము తెలుగు గడ్డపై నివసిస్తున్నాం... జై భారత్ జై పర్షియా" అని ఒకరు.. 'ఇతర దేశాలతో పోలిస్తే ఇరాన్ సోషల్ మీడియా రంగం చాలా మెరుగ్గా ఉంది' అని మరొకరు వ్యాఖ్యానించారు. ఇరాన్ ఎంబసీ పెట్టిన పోస్ట్ ఇప్పటి వరకూ 2 లక్షలకుపైగా వ్యూస్ రాగా.. 4 వేలకుపైగా లైక్‌లు వచ్చాయి. ఇదిలా ఉండగా, ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీతో ఇరాన్‌పై దాడులు చేయడంతో యుద్ధం మొదలైంది. తమ సుప్రీం నేత ఆయతుల్లా అలీ ఖమేనీ సహా కీలక నేతల మరణాలకు ప్రతీకారంగా గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా మిత్రదేశాలు, దాని సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. పూర్తిస్థాయి యుద్ధానికి దారితీయడంతో ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జల సంధిని ఇరాన్ మూసివేసింది. ఇది అంతర్జాతీయంగా తీవ్ర ప్రభావం చూపింది.

# కొంగర కుర్దు భూములు రైతులకే దక్కాలి కవిత

హైదరాబాద్:రంగారెడ్డి జిల్లా కొంగరకుర్దు – ఏ గ్రామ భూ బాధితులతో కలిసి తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మీడియా సమావేశం నిర్వహించారు.

కవిత మాట్లాడుతూ కొంగరకుర్దు– ఏ లో కాంగ్రెస్, బీఆర్ఎస్ భూ మాఫియా నడుస్తోంది. ఆ భూములు రైతులకే దక్కాలి. అధికార, ప్రతిపక్ష ముఖ్య నాయకులు వక్ఫ్ భూములు కొట్టేస్తున్నారు. నమస్తే తెలంగాణ, సాక్షిలో ఒక్క రోజు వార్తలు రాసి బీఆర్ఎస్ ముఖ్య నేత ఒత్తిడితో కబ్జా బాగోతాన్ని పక్కన పెట్టారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఆర్గనైజ్డ్ గా భూ మాఫియా పెద్ద ఎత్తున భూములు కబ్జా పెడుతోందని అన్నారు.కొంగరకుర్దులో ఉన్న 580 ఎకరాల వక్ఫ్ భూమిలో ఇప్పటికే 150 ఎకరాలు భూ మాఫియా చెరలోకి వెళ్లిపోయింది. కొంగరకుర్దులోని సర్వే నంబర్లు 2 నుంచి 400 వరకు ఉన్న 580 ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుకు చెందుతుందని 2007లోనే గెజిట్ ఇచ్చి 22ఏ లో చేర్చారు. 2022లో ఈ భూములపై మాఫియా కన్ను పడింది.. ఒక రైతు 58 ఎకరాల్లో పంటలు సాగు చేస్తే మూడు జేసీబీలతో ఆ పంటను ధ్వంసం చేసి లే అవుట్ చేశారు. బిహార్, ఉత్తర ప్రదేశ్ లో ఎంతటి దౌర్జన్య పరమైన రాజ్యం సాగుతుందో కొంగరకుర్దులో అంతే దౌర్జన్యం గా రైతులు సాగుచేసుకుంటున్న భూములు లాక్కున్నారు. భూ మాఫియా ఆగడాలపై రెవెన్యూ, పోలీస్ అధికారులకు రైతులు ఫిర్యాదు చేసినా కనీసం కేసులు కూడా నమోదు చేయడం లేదు. కొంగరకుర్దు గ్రామంతో సంబంధం లేని వారి పేర్లతో ఓ ఆర్ సీ లు సృష్టించి వాటితో కోర్టుల్లో కేసులు వేసి అనుకూలంగా జడ్జిమెంట్ లు తెచ్చుకొని రిజిస్ట్రేషన్ లు చేయించుకుంటున్నారు. 2022 లో 22ఏ లో ఉన్న కొంగరకుర్దు భూములు రిజిస్ట్రేషన్ అయ్యాయి.. దానికి సంబంధించిన అన్ని రికార్డులు ప్రభుత్వం దగ్గర ఉన్నాయి.




అర్బన్ క్రెస్ట్, సిటీ గ్రాండ్ ఎన్ క్యూ వెంచర్స్ అనే సంస్థలు ఇక్కడ భారీ వెంచర్లు వేశాయి.. 2022 తర్వాత ఇక్కడ జరిగిన అన్ని రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి. నిషేధిత జాబితాలో ఉన్న భూముల్లో లే అవుట్ పర్మిషన్ ఎలా ఇచ్చారు.. హెచ్ఎండీఏ కమిషనర్ ఏం చేస్తున్నారని అన్నారు, కొంగరకుర్దు రైతులను రెండు నిర్మాణ సంస్థలు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కలిసి రూ.5 వేల కోట్ల విలువైన 580 ఎకరాల భూమిని కొట్టేస్తున్నారు.. బందిపోటు దొంగలు కూడా ఇలా పగటి పూట దొంగతనం చేయరు. నమస్తే తెలంగాణ లో ఒక్క రోజు ఈ భూ మాఫియాపై వార్త వచ్చింది.. అది ఒక ప్రముఖ బీఆర్ఎస్ నాయకుడి వెంచర్ .. వెనుక మరో ముఖ్య నాయకుడు ఉన్నాడు.. తెల్లారి నుంచి ఆ పేపర్ ల ఒక్క ముక్క కూడా రాయలేదు. నర్సమ్మ అనే రైతు భూమికి లక్ష్మి అనే పేరుతో ఓ ఆర్ సీ తెచ్చుకున్నారు.. ఇలాంటి అక్రమాలు ఎన్నో కొంగరకుర్దులో జరిగాయి.. వెంటనే ఆ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి బీఆర్ఎస్ పాలనలో కొన్ని ఇండ్లే బంగారం అయ్యాయని నేను చెప్పిన దానికి ఈ కొంగరకుర్దు భూములు కూడా సాక్ష్యంగా నిలుస్తున్నాయి.. ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు.

# కొలిక్కి వచ్చిన వివేకా కేసు



హైదరాబాద్, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో రోజుకో కొత్త మలుపు చోటుచేసుకుంటోంది. ఈ కేసులో ఏ2గా ఉన్న కీలక నిందితుడు సునీల్ యాదవ్ సంచలన కామెంట్లతో విచారణాధికారులతో పాటు రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపారు. హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు, వెనుక ఉన్న కుట్ర కోణాలను తాను ఈడీ అధికారులతో పాటు బయటి ప్రపంచానికి కూడా వెల్లడిస్తున్నారు. ఈ హత్య వెనుక ఉన్న అసలు కారణాలు, లాభపడిన వ్యక్తుల పేర్లను నేరుగా ప్రస్తావిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఈ కేసు తీవ్రతను మరో స్థాయికి తీసుకెళ్లాయి. వివేకా హత్య ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లాభపడింది మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆయన భార్య వైఎస్ భారతి, అలాగే కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాత్రమేనని సునీల్ యాదవ్ సంచలన ఆరోపణలు చేశారు. అసలు సూత్రధారులను పక్కనపెట్టి తమ వంటి వారిని వేధించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, విచారణ పారదర్శకంగా జరగాలంటే జగన్ , భారతిలను కూడా సీబీఐ, ఈడీ అధికారులు తక్షణమే విచారించాలని ఆయన బహిరంగంగా డిమాండ్ చేశారు. ఇప్పటికే అప్రూవర్‌గా మారిన దస్తగిరి ఇచ్చిన వాంగ్మూలం కంటే, కుట్రలో చురుగ్గా పాల్గొన్న సునీల్ యాదవ్ ఇలా తెగించి మాట్లాడటం కేసు గమనాన్ని మార్చేలా ఉంది.సునీల్ యాదవ్ చేసిన ఈ ఆరోపణలు దర్యాప్తు సంస్థల పనితీరుపై కూడా పలు అనుమానాలను, ప్రశ్నలను రేకెత్తిస్తున్నాయి. హత్య జరిగిన సమయం నుంచి నేటి వరకు లభ్యమైన ఆధారాలు, సాక్ష్యాలు ఒక వైపు వేళ్లు చూపిస్తున్నప్పటికీ.. దర్యాప్తు సంస్థలకు ఈ ప్రాథమిక అనుమానాలు ఎందుకు రావడం లేదనే చర్చ నడుస్తోంది. కేసులో ప్రధాన సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కీలక వ్యక్తుల సమీపానికి కూడా సీబీఐ అధికారులు వెళ్లేందుకు ఎందుకు సంకోచిస్తున్నారనే ప్రశ్నలు బాహాటంగానే వినిపిస్తున్నాయి.దస్తగిరి, సునీల్ యాదవ్ కేవలం హత్యలో భాగం అయిన వారు. డబ్బుల కోసం ఆ పని చేసిన వారు. కానీ అసలు సూత్రధారులు , హత్యకు కారణమైన పెద్ద తలకాయలను విచారించకుండా, కేవలం క్షేత్రస్థాయిలో ఉన్న వారిపైనే దృష్టి సారిస్తే ఈ కేసు చిక్కుముడి ఎలా వీడుతుందనేది యక్షప్రశ్నగా మారింది. గత కొన్నేళ్లుగా సాగుతున్న ఈ హైప్రొఫైల్ హత్య కేసులో దస్తగిరి తరహాలోనే మరొక కీలక నిందితుడు బయటపడి నేరుగా మాజీ సీఎం కుటుంబాన్నే నిలదీయడం రాజకీయంగా పెద్ద దుమారమే రేపుతోంది. సునీల్ యాదవ్ లేవనెత్తిన ఈ డిమాండ్లపై సీబీఐ, ఈడీ అధికారులు ఏ రకంగా స్పందిస్తారో, విచారణ ప్రక్రియను ఏ మలుపు తిప్పుతారో వేచి చూడాల్సి ఉంది.

# అధికార పార్టీలకు మైలేజీ ఇస్తుందా...

హైదరాబాద్, ఖైరతాబాద్ శాసనసభ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. సుప్రీంకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ ఉపఎన్నికల కౌంట్‌డౌన్ ప్రారంభం కాగా, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆరు నెలల వ్యవధిలోనే ఇక్కడ ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంది. అయితే ఖైరతాబాద్‌తో పాటు విస్తృతమైన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యాప్తంగా స్థానిక సమరానికి ఎందుకు ముహూర్తం ఖరారు కావడం లేదనేది ఇప్పుడు హైదరాబాద్ రాజకీయాల్లో ఆసక్తికరమైన చర్చగా మారింది. జీహెచ్ఎంసీ పాలకమండలి పదవీకాలం ఫిబ్రవరిలోనే ముగిసినప్పటికీ, ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల వైపు వేగంగా అడుగులు వేయకపోవడం వెనుక పలు రాజకీయ, పరిపాలనాత్మక కారణాలు ఉన్నాయి.గ్రేటర్ పాలనను మరింత వేగవంతం చేసేందుకు జీహెచ్ఎంసీని మూడు మున్సిపల్ కార్పొరేషన్లు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరిగా విభజించారు. ఈ విభజన తదుపరి పునర్విభజన , వార్డుల సంఖ్య పెంపు, బీసీ రిజర్వేషన్లపై కోర్టుల్లో నడుస్తున్న వివాదాలు ప్రభుత్వం ముందుకు రాకుండా అడ్డంకిగా మారాయి. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఎలాగూ తప్పదు కాబట్టి, అదే ఊపులో గ్రేటర్ ఎన్నికలను కూడా నిర్వహించి ముగించేస్తే ఒక పని అయిపోతుందనే ప్రతిపాదన ఉన్నప్పటికీ, కాంగ్రెస్ నాయకత్వం మాత్రం అత్యంత జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. నిజానికి గ్రేటర్ పరిధిలో ఇప్పటివరకు జరిగిన రెండు అసెంబ్లీ ఉపఎన్నికల్లోనూ కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. ఈ వరుస విజయాలు అధికార పార్టీకి మంచి మైలేజ్ ఇచ్చాయనడంలో సందేహం లేదు. అయినప్పటికీ గ్రేటర్ కార్పొరేషన్ స్థానిక పోరు విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఎందుకు సందేహిస్తోంది? మొదటిది, అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఉపఎన్నికల సరళి వేరు, మున్సిపల్ వార్డు స్థాయి ఎన్నికల సరళి వేరు. కార్పొరేటర్ల స్థాయి పోరులో స్థానిక సమస్యలు, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, మూసీ పునరుజ్జీవన పథకం వల్ల ప్రభావితమైన నిర్వాసితుల అసంతృప్తి నేరుగా ఓటింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కొన్ని ఆక్రమణల తొలగింపు కార్యక్రమాలు గ్రేటర్ పరిధిలోని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాల్లో కొంత కలకలం రేపాయి. ఈ పరిస్థితుల్లో ముందస్తుగా గ్రేటర్ ఎన్నికలకు వెళ్తే అది ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలకు కలిసివస్తుందేమోననే భయం కాంగ్రెస్ స్థానిక నేతల్లో ఉందనే ప్రచారం ఉంది.రెండవది, కాంగ్రెస్‌కు హైదరాబాద్ నగర పరిధిలో ఉన్న బలమైన కేడర్ కొరత. గతంలో ఎంఐఎం, బీఆర్ఎస్‌లకు గ్రేటర్‌లో పక్కా యంత్రాంగం ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర పార్టీల నుంచి కొంతమంది విలీనమైనప్పటికీ, వార్డు స్థాయిలో 300 వార్డుల పరిధిలో సరైన అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవడం కాంగ్రెస్‌కు ఐక్యతాపరంగా పెద్ద సవాలుగా మారనుంది. పార్టీ అంతర్గత విభేదాలు బయటపడితే గ్రేటర్ గెలుపుపై ప్రభావం పడుతుందనే యోచనలో నాయకత్వం ఉంది. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితం కాంగ్రెస్‌కు లిట్మస్ టెస్ట్‌గా మారబోతోంది. ఒకవేళ ఖైరతాబాద్‌లో దానం నాగేందర్ , కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజారిటీతో విజయం సాధిస్తే, ఆ పొలిటికల్ వేవ్‌ను వాడుకుని తక్షణమే గ్రేటర్ కార్పొరేషన్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. అప్పటివరకు న్యాయస్థానాల్లో ఉన్న లీగల్ అడ్డంకులను క్లియర్ చేసి, వార్డుల రిజర్వేషన్లను ఖరారు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.రాబోయే 3 నుంచి 4 నెలల్లో ఖైరతాబాద్ ఉపఎన్నికతో పాటు గ్రేటర్ సమరంపై రేవంత్ రెడ్డి సర్కార్ ఒక స్పష్టమైన నిర్ణయానికి రాక తప్పదు.

# పొంగులేటి పై చర్యలకు సిద్ధమేనా...?







హైదరాబాద్,జనసమయం: హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నేతలు చేపట్టిన ఆందోళన చర్చనీయాంశమైంది. తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సంబంధించిన ఈడీ విచారణపై ఆరా తీస్తామంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున ఈడీ ఆఫీసు ముట్టడికి ప్రయత్నించారు. రెండేళ్ల క్రితం జరిగిన సోదాలపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలు తమకు చెప్పాలంటూ వారు డిమాండ్ చేస్తున్నారు. ఈడీ కార్యాలయం బయట బీఆర్ఎస్ నేతలు బైఠాయించి నినాదాలు చేస్తుండటంతో పోలీసులు వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆందోళనలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్, ఎమ్మెల్సీలు శంబీపూర్ రాజు, నవీన్ కుమార్ తదితరులు పాల్గొని పోలీసుల తీరుపై వాగ్వాదానికి దిగారు. అయితే, ఆ తర్వాత పోలీసుల అనుమతితో ఒక ప్రతినిధి బృందం ఈడీ అధికారులను కలిసే అవకాశం కల్పించారు. అయినా హడావుడి కోసం రోడ్డుపై బైఠాయించి ధర్నాచేసారు. కాంగ్రెస్ మంత్రులకు ఒక రకమైన న్యాయం, ప్రతిపక్ష నేతలకు మరో రకమైన న్యాయం జరుగుతోందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ లో విమర్శలు చేశారు. చట్టబద్ధంగా నడిచే కేంద్ర దర్యాప్తు సంస్థల పనితీరులో జోక్యం చేసుకునే హక్కు ఏ రాజకీయ పార్టీకి ఉండదు. దర్యాప్తు ఏ దశలో ఉందనే అంశాలను బహిర్గతం చేయాల్సిన బాధ్యత ఈడీకి ఉండదు. కానీ, కేవలం రాజకీయంగా ప్రత్యర్థులను ఇరుకున పెట్టాలనే ఉద్దేశంతో, తాము చెప్పినట్టుగానే దర్యాప్తు సంస్థలు పనిచేయాలని బీఆర్ఎస్ నేతలు ఒత్తిడి తెస్తుండటం విచిత్రంగా ఉందన్న వాదన వినిపిస్తోంది. ఒకవైపు సొంత పార్టీ నేతలు ఎదుర్కొంటున్న కేసుల విచారణ సమయంలో దర్యాప్తు సంస్థలను తప్పుపట్టిన గులాబీ నేతలు, ఇప్పుడు ఇతర పార్టీల నేతల విషయంలో తామే జ్యుడీషియరీగా మారిపోయి తీర్పులు చెప్పాలని చూస్తున్నారని అంటున్నారు.

# కవిత ఓటు ఎవరికి చేటు...

హైదరాబాద్, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తెలంగాణలో జరిగే అన్ని ఎన్నికలలో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. కవిత పోటీ చేయడం వల్ల ఏ పార్టీకి లాభం? ఎవరికి నష్టం? అసలు కవిత పార్టీ అనుకున్న స్థాయిలో ఓట్లను సాధిస్తుందా? అన్న దానిపైన ప్రస్తుతం చర్చ జరుగుతుంది. త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ, తర్వాత జరగనున్న ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లోనూ తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులు బరిలో ఉంటారని కవిత ప్రకటించారు. దీంతో ఎవరి ఓట్లకు గండి కొట్టనున్నారన్న హాట్ టాపిక్ ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో నడుస్తుంది. కల్వకుంట్ల కవిత తన సరికొత్త రాజకీయ ప్రయాణంలో 'సామాజిక తెలంగాణ' సాధించడమే తన ప్రధాన లక్ష్యం అని ప్రకటించారు. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత, ఆమె తెలంగాణ రక్షణ పేరుతో సరికొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆశించిన ఆశయాలు నెరవేరలేదని, భౌగోళిక తెలంగాణ సిద్ధించినప్పటికీ సామాజిక తెలంగాణ ఇంకా సాకారం కాలేదని ఆమె పేర్కొన్నారు. ఆమె తన కొత్త పార్టీ ద్వారా ఎన్నికల్లో పోటీ చేసి ఏమి చేయాలనుకుంటున్నారనే దానికి సంబంధించిన ముఖ్యమైన ఐదు గ్యారెంటీలు కూడా ప్రకటించారు. ప్రైవేట్ స్కూళ్లలో సైతం నాణ్యమైన, ఉచిత విద్యను అందించడం. దీర్ఘకాలిక వ్యాధులతో సహా అన్ని రకాల రోగాలకు పూర్తి ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించడం. యువతలో స్వయం ఉపాధి, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి స్టార్టప్‌లకు తగిన నిధులు అందించడం. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రైతులకు ప్రత్యేక సహాయక డెస్కులను ఏర్పాటు చేసి, 'రైతే రాజు' అనే నినాదాన్ని నిజం చేయడం. వెనుకబడిన తరగతులకు, మహిళలకు, యువతకు రాజకీయంగా, సామాజికంగా సమాన



అవకాశాలు కల్పించడం వంటి నినాదాలతో ఎన్నికలకు కవిత పార్టీ వెళ్లనుంది.. ఆమె నాయకత్వంలోని పార్టీ రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, స్థానిక సంస్థలు, ఉప ఎన్నికలతో పాటు 2029 సార్వత్రిక ఎన్నికల్లోనూ పూర్తిస్థాయిలో పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 4 లక్షల ఉద్యోగాలను సృష్టించడం తమ లక్ష్యమని ప్రకటించారు గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు మరియు ఖైరతాబాద్ ఉప ఎన్నికల వంటి స్థానిక పోరులో అభ్యర్థులను నిలబెట్టడం ద్వారా ప్రజాక్షేత్రంలో తమ పట్టును బలోపేతం చేసుకోవాలని భావిస్తున్నారు. రాష్ట్ర హక్కుల పోరాటం: కేంద్ర–రాష్ట్ర సంబంధాల్లో రాష్ట్రాలకు సమాన అధికారాలు ఉండాలని, ప్రజాస్వామ్య ఫ్రంట్‌గా ఏర్పడి ప్రజల నిజమైన ఆకాంక్షల కోసం పోరాడాలని కవిత లక్ష్యంగా పెట్టుకున్నారు. తమ అభ్యర్థులు ఖచ్చితంగా బరిలో ఉంటారని, అయితే ఎన్నికల్లో గెలుపోటములను పక్కన పెట్టి బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా తాను ప్రచారంలో పాల్గొంటానని చెప్పారు. మరొకవైపు తన కుటుంబ ఆస్తుల వివరాలను ప్రతి ఏడాది ప్రకటించాలని కవిత నిర్ణయించుకోవడం మరొక విశేషం. మొత్తం మీద ఎవరి ఓట్లకు కవిత గండి కొడతారన్నది రానున్న కాలంలో తేలనుంది

# ఆర్టికల్ 170

భారత రాజ్యాంగము

3వ అధ్యాయము

రాష్ట్ర శాసన మండలి

The State Legislature

సాధారణ విషయాలు

General

ఆర్టికల్ 168 : రాష్ట్రాలలో శాసన మండలుల ఏర్పాటు :- (1) ప్రతి రాష్ట్రానికి శాసన మండలి ఉండవలెను. అది గవర్నరుతోనూ-

(ఎ) ఆంధ్రప్రదేశ్, బీహారు, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ౹తమిలనాడు, తెలంగాణ,రి ఉత్తర్ ప్రదేశ్, రాష్ట్రాలలో రెండు నభలతోనూ;

(బి) మిగతా రాష్ట్రాలలో ఒకే నభతోనూ కూడి ఉండును.

(2) ఒక రాష్ట్రంలోని శాసన మండలి రెండు సభలతో కూడి ఉన్నప్పుడు అందులో ఒక దానిని శాసణ పరిషత్తు (Legislative Council) అనియు, రెండవ దానిని శాశనసభ (Legislative Assembly) అనియు పిలువవలెను. ఒకే సభ ఉన్నట్లయితే దానిని శాననసభ (Legislative Assembly) అంటారు.

ఆర్టికల్ 169 : రాష్ట్రాలలో శాసన పరిషత్తును రద్దు చేయుట

## భారత రాజ్యాంగం




లేదా ఏర్పరుచుట :-(1) 168వ ఆర్టికలులో ఏమిఉన్నప్పటికినీ, పార్లమెంటు శాననం చేయుట ద్వారా శానన వరిషత్తు ఉన్న రాష్ట్రంలో, అట్టి వరిషత్తును రద్దుచేయవచ్చును.
అట్టి పరిషత్తు లేని రాష్ట్రంలో అట్టి వరిషత్తును ఏర్పరచ వచ్చును. ఇందునిమిత్తం నదరు రాష్ట్ర శానన సభ, మొత్తం సభ్యత్వంలో అధిక సంఖ్యాకుల చేతను, హాజరై ఓటు వేయు సభ్యులలో మూడింట రెండు వంతులకు తక్కువ కాని సభ్యులచే తీర్మానము ఆమోదింపజేసి ఉండవలెను.

(2) క్లాజు (1) లో పేర్కొనబడిన ఏదేని శాసనంలో, ఆ శానన నిబంధనలను అమలు వరచుటకు అవసరమైనట్టి, ఈ రాజ్యాంగము సవరించునట్టి నిబంధనలు ఉండవలెను మరియు అట్టి శాసనంలో పార్లమెంటు అవసరమని భావించునట్టి అనుబంధ, ఆనుషంగిక, పారిణామిక (supplemental, incidental and consequential) నిబంధనలు కూడ చేర్చవచ్చును.

(3) పైన పేర్కొనినట్టి ఏదేని శాసనం, 368వ ఆర్టికలు

ప్రయోజనముల నిమిత్తం రాజ్యాంగ సవరణగా పరిగణించరాదు.

ఆర్టికల్ 170 : శాసన సభల నిర్మాణము (constitution) :–

(1) రాజ్యాంగము 333 ఆర్టికలులోని నిబంధనలకు లోబడి, ప్రతి రాష్ట్ర శాసనసభ, రాష్ట్రంలోని ప్రాదేశిక నియోజకవర్గాల (Territorial Constituencies) నుండి ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఎన్నుకొనబడిన 500లకు మించని, 60కి తక్కువ కాని సభ్యులతో కూడి వుండవలెను.

రాష్ట్రములు

307 (2) కాజు (1) ప్రయోజనాల నిమిత్తం ప్రతి రాష్ట్రమును ప్రాదేశిక నియోజకవర్గములుగా. విభజించవలెను. అనగా ప్రతి నియోజకవరవు జనాభా, ఆ రాష్ట్రమునకు కేటాయించిన సీట్ల సంఖ్య ఆచరణ రీత్యా సాధ్యమైనంత వరకు రాష్ట్ర మంతటా ఒకే విధంగా ఉండే విధంగా. రాష్ట్రమును నియోజకవర్గములుగా విభజించవలెను.

విశదీకరణ :– ఈ క్లాజులో, “జనాభా” అను వదమునకు కట్టకడవటియగు అందుకు సంబంధించిన అంకెలు ప్రచురించబడినదగు జనాభా లెక్కల సేకరణలో నిర్ణయించబడిన జన సంఖ్య అని అర్థం.

ప్రచురించబడినదియగు జనాభా లెక్కల సేకరణకు గల నిరేశమును [2026] సంవత్సరం పిమ్మట అయితే, ఈ విశదీకరణలో కట్టకడపటియగు అందుకు సంబంధించిన అంకెలు చేయబడు మొదటి జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన అంకెలు ప్రచురించబడునంత వరకు, *[2001] సంవత్సరపు జనాభా లెక్కల సేకరణకు సంబంధించి నిరేశమైనట్లు అన్వయించవలెను. *[Subs.by the Const. (84th Amdt.) Act, 2001 w.e.f. 21st Feb. 2002]

**[Subs. by the Const. (87th Amdt.) Act, 2003, 22-6-2003]

(3) ప్రతి జనాభా లెక్కల సేకరణ పూర్తయిన మీదట ప్రతి రాష్ట్ర శాసన సభలోని మొత్తం సీట్ల సంఖ్యను, ప్రతి రాష్ట్రమును ప్రాదేశిక నియోజకవర్గముల విభజనను, పార్లమెంటు శాసనం ద్వారా నిర్ణయించునట్టి ప్రాధికారి మరియు అట్టి రీతిలో తిరిగి సర్దుబాటు చేయవలెను:

అయితే, అట్లు తిరిగి చేసిన నర్దుబాటు, అప్పుడున్న శాననసభ రద్దు చేయబడునంత వరకు ఆ శాసన సభలోని ప్రాతినిధ్యమునకు భంగము కలిగించరాదు.

అంతేకాక, అట్లు చేయబడిన నర్దుబాటు, రాష్ట్రపతి ఉత్తరువు ద్వారా నిర్దిష్టపరచునట్టి తేదీ నుండి అమలులోనికి వచ్చును. మరియు అట్టి తిరిగి నర్దుబాటు అమలులోనికి వచ్చునంతీ వరకు, ఏదేని శాసనసభకు ఎన్నికను అట్టి తిరిగి సర్దుబాటుకు ముందు ఉన్న ప్రాదేశిక నియోజకవర్గముల ప్రాతిపదిక పై జరవవచ్చును.

అయితే ఇంకనూ, ౹౹2026౹౹వ సంవత్సరము పిమ్మట చేయు మొదటి జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన అంకెలు ప్రచురించబడు నంతవరకు, సర్దుబాటు చేయవలెను.

[Substituted by Const. (84th Amdt.) Act, 2001 w.e.f. 21-2-2002]

(i) 1971 జనాభా లెక్కల సేకరణ ప్రాతివదికపై తిరిగి నర్దుబాటు చేసినట్టి, ప్రతి రాష్ట్ర శాసనభలోని మొత్తం సీట్ల సంఖ్యను; మరియు

(ii) ౹౹౹౹2001౹౹ జనాభా లెక్కల సేకరణ ప్రాతివదిక పై తిరిగి నర్దుబాటు చేసినట్టి ప్రాదేశిక నియోజక వర్గాలుగా అట్టి రాష్ట్ర విభజనను, తిరిగి నర్దుబాటు చేయవలసిన అవసరం లేదు.

(Inst. by the Const. (42nd Amdt.) Act, 1976 w.e.f. 3-1-1977]

:(1) శాసన పరిషత్తు వున్న రాష్ట్రంలోని అట్టి పరిషత్తులో మొత్తం సభ్యుల సంఖ్య ఆ రాష్ట్ర శాసన సభలోని మొత్తం సభ్యులలో శిమూడింట ఒక వంతుకురి మించరాదు: భారత రాజ్యాంగము

అయితే, ఒక రాష్ట్ర శాసన పరిషత్తులో మొత్తం సభ్యుల సంఖ్య, ఎట్టి సందర్భంలోను నలభై కంటే తగ్గరాదు.

(2) పార్లమెంటు, శాసనం ద్వారా ఇతర విధంగా నిబంధించునంతవరకు రాష్ట్ర శాసన పరిషత్తు యొక్క నిర్మాణము క్లాజు (3) లోని ప్రకారం వుండవలెను.

(3) రాష్ట్ర శాసన వరిషత్తు సభ్యుల మొత్తం సంఖ్యలో ---

(ఎ) వీలైనంత దగ్గరి సంఖ్యలో గల 1/3 వంతు మంది ఆ రాష్ట్రంలోని మునిసిపాలిటీల, జిల్లా బోర్డుల మరియు పార్లమెంటు శాసనం ద్వారా నిర్దిష్టపరచు ఇతర స్థానిక సంస్థలకు ఎన్నికయిన, సభ్యులతో కూడిన నియోజకవర్గముచే ఎన్నుకోనబడాలి.

(బి) వీలైనంత దగ్గర సంఖ్యలో గల 1/12 వంతు మంది. కనీసం మూడు సంవత్సరాలు భారత భూభాగములోని ఏదైనా విశ్వవిద్యాలయవు గ్రాడ్యుయేట్లుగా వుండి, లేక పార్లమెంటు చేసిన ఏదేని శాసనము ద్వారా లేక దాని క్రింద అట్టి ఏదేని విశ్వవిద్యాలయం యొక్క గ్రాడ్యుయేషను అర్హతలకు సమానమని నిర్ణయించబడిన అర్హతలను కనీసం మూడు సంవత్సరాలు కలిగివుండి. ఆ రాష్ట్రంలో నివసించు వ్యక్తులతో కూడిన నియోజకవర్గంచే ఎన్నుకొనబడాలి.

(సి) వీలైనంత దగ్గరి సంఖ్యలో గల 1/12 వంతు మంది పార్లమెంటు చేసిన ఏదేని శాసనం ద్వారా లేదా శాసనం క్రింద నిర్ణయించబడునట్టి సెకండరీ పాఠశాల స్థాయికి తక్కువకాని ఆ రాష్ట్రములోని విద్యాసంస్థలలో కనీసం మూడేండ్లపాటు అధ్యాపక వృత్తిలో వున్న వ్యక్తులతో కూడిన నియోజక వర్గముచే ఎన్నుకోబడాలి.

(డి) వీలైనంత దగ్గరి సంఖ్యలో గల 1/3 వంతు మంది ఆ రాష్ట్ర శాసనసభ సభ్యులచే ఆ సభలో సభ్యులు కానట్టి వ్యక్తుల నుండి ఎన్నుకోవలెను.

(ఇ) మిగతా సీట్లకు, క్లాజు (5) లోని నిబంధనలను అనుసరించి, గవర్నరు నామినేటు చేయాలి.

(4) క్లాజు (3) లోని సబ్-క్లాజులు (ఎ), (బి), (సి)ల క్రింద ఎన్నుకొనబడవలసిన సభ్యులు, పార్లమెంటు చేసిన ఏదేని శాసనము ద్వారా లేక దాని క్రింద విహితం చేయబడు ప్రాదేశిక నియోజకవర్గముల నుండి ఎంపిక చేయబడవలెను, సదరు సబ్-క్లాజుల క్రిందను, సదరు కాజు యొక్క సబ్ క్లాజు (డి) క్రింద జరుగు ఎన్నికలు, ఏకల అంతరణీయ ఓటు ద్వారా దామాషా (with the system of proportional representation by means of the single transfer-able vote] ని అనుసరించి జరగవలెను.

(5) క్లాజు (3) సబ్-క్లాజ్ (ఇ) క్రింద గవర్నరు నామినేట్ చేయవలసిన సభ్యులు, ఈ క్రింది వాటిని పోలిన విషయములందు విశేషజ్ఞానమును, వ్యవహారికానుభవనమునుగాని, కలిగిన వ్యక్తులై యుండవలెను.

సాహిత్యం, విజ్ఞానశాస్త్రం, కళ, సహకారోద్యమం, సాంఘిక సేవ.

ఆర్టికల్ 172: రాష్ట్ర శాసన మండలి కాలావధి :(1) ప్రతి

రాష్ట్రపు శాసనసభ, ముందే రద్దు చేయబడితే తప్ప, తన మొదటి సమావేశమునకు నియమితము చేసిన తేదీ నుండి అయిదు

ఆర్టికల్ 174

రాష్ట్రములు

309 సంవత్సరాలపాటు కొనసాగవలెను. అంతకు మించి కొనసాగరాదు. నదరు [ అయిదు సంవత్సరాల కాలావధి ముగిసిన వెంటనే ఆ శాసనసభ

దాని అంతట అదే రద్దు, కావలెను: [Subs. by the Constitution (44th Amdt. Act, 1978, Sec. 28 for »»Six yearsµµ w.e.f. 6-9-1979. The words »»Six yearsµµ were subs, for the original words »»Five yearsµµ by the Constitution (42nd Amdt.) Act, 1976, w.e.f. 3-1-19771

అయితే, అత్యయిక పరిస్థితి ప్రకటన (Proclamation of Emergency) అమల్లో ఉన్నప్పుడు, నదరు కాలావధి, తడవకు ఒక సంవత్సరమునకు మించకుండా ప్రకటన అమలులో ఉండుట ముగిసిన తరువాత ఎట్టి సందర్భంలోనూ ఆరు నెలలు దాటకుండా పార్లమెంటు కాననము ద్వారా పొడిగించవచ్చును.

(2) అయితే, రాష్ట్ర శాసన పరిషత్తు, ఎప్పుడూ రద్దు చేయబడదు. కాని దానిలోని దాదావు మూడింట ఒక వంతు మంది సభ్యులు, ఈ విషయంలో పార్లమెంటు చేసిన కాననములోని నిబంధనలను అనుసరించి, ప్రతి రెండవ సంవత్సరం ముగిసిన తరువాత వీలైనంత త్వరితంగా సభ్యత్వము నుండి విరమించవలెను.

ఆర్టికల్ 173 : రాష్ట్ర శాసన మండలి (State Legislature)

(ఎ) భారత పౌరుడై వుండి, ఎన్నికల కమీషను ఈ విషయంలో ప్రాధికారమిచ్చిన ఎవరేని వ్యక్తి ఎదుట, మూడో షెడ్యూలులో ఈ ప్రయోజనం నిమిత్తం పొందుపరచిన నమూనాలో ,] [Subs. by Const. (16th Amdt.) Act, 1963]

(బి) శాసన సభలోని సీటు విషయంలో, 25 సంవత్సరాలకు తక్కువ కాని వయను కలిగివుంటే తప్ప, శాసన పరిషత్తు సీటు విషయంలో 30 సంవత్సరాలకు తక్కువ కాని వయను కలిగివుంటే తప్ప,

(సి) ఈ విషయంలో పార్లమెంటు చేసిన ఏదేని శాసనం ద్వారా లేదా క్రింద నిర్ణయించినట్టి ఇతర అర్హతలు కలిగివుంటే తప్ప,

రాష్ట్రశాసన మండలిలో సభ్యుడుగా ఎంపిక కావడానికి అర్హుడు కారాదు.

ఆర్టికల్ 174 : రాష్ట్ర శాసన మండలి సమావేశములు, సమావేశ నిరవధిక వాయిదా

(Prorogation) ? ? (dissolution) :-(1) ? ? ? రాష్ట్ర శాసన మండలిలోని ఒక సభను లేదా ప్రతి సభను ఆయన యుక్తమని తలచు సమయంలోనూ, స్థలములోనూ, సమావేశమగుటకై ఆహ్వానించవలెను. కాని ఒక సమావేశపు చివరి సిట్టింగుకు దాని తదువరి సమావేశపు మొదటి సిట్టింగుకు నిర్ణయించిన తేదీకి మధ్య కాలావధి ఆరు నెలలకు మించరాదు.

(2) గవర్నరు ఎప్పటికప్పుడు---

(ఎ) సభ లేదా రెండింటిలో ఏదైనా ఒక సభను నిరవధిక వాయిదా (అధివేశనావసానము) (ప్రోరోగు) చేయవచ్చును;

# పుల్లింగ న్యాయధిక్కారం

## సాహిత్యం



అనుమానం లేదు తాళిలేని కడుపుతీపిని తాళలేక పోయింది కన్నతల్లే బిడ్డను చంపింది న్యాయమూర్తులుంగారూ కాస్సేపు మగసాక్షి తప్ప మనస్సాక్షిలేని మీ ముఖాన్ని ఏ శిక్షాస్మృతి లోనో పాతి పెట్టండి.

మన్నించాలి మీ తీర్పును వినడం కోసం మేం రాలేదు తెగిన పేగుకు శిక్ష తప్పించమని వాదించడం లేదు తల్లి చంపక పోయినా బిడ్డ చస్తుంది ఘోషా గోడల మధ్య సుకుమారంగా చస్తుంది.

నాగరీకుల కౌగిళ్ళలో నఖక్షతాలతో చస్తుంది. ఈ వాయిదాల చావులకు హఠాన్మరణమే ప్రథమ చికిత్స

అందుకే మీలార్డ్ కనిపారేసిన ఖాళీపేగు నవ్వుకున్నది బిడ్డ నోరు నొక్కి తల్లి కెవ్వుమన్నది ఇది కొత్త కాదు సగం భారతమంతా సజల నయనాల శాకుంతలమే

వాఇక్కడ ఆవునీ అడదాన్నీ ఒకేలా పూజిస్తారు.

నెత్తుటి క్షీరాన్ని పీల్చి నైవేద్యంగా నాలుగ్గడ్డిపరకలు వేస్తారు కట్టురాళ్ళూ, కన్నెతాళ్ళూ, కాసుల పేర్లు–వాటి(రి)కి భక్తితో పెట్టే ఆభరణాలు పసుపు కుంకుమలే బతుక్కి ఆద్యంతాలు వంటిల్లు కేంద్రంగా, పాతివ్రత్యం వ్యాసార్ధంగా గీసిన వృత్తమే వారి మొత్తం ప్రపంచం అది తన చుట్టూ తాను తిరుగుతూ పురుషుని చుట్టూ తిరుగుతుంది.

యువరానర్! ఇవన్నీ విన్నాక మీకు తల తిరుగుతుందేమో. ఏ మేరేజ్ యాక్టుతోనో మీ మెదడు మీద కొట్టుకోండి తండ్రీ, మొగుడూ, కొడుకూ అందరూ కాపలా దార్లే బాల్యం, యవ్వనం, వృధ్ధాప్యం మూడు షిఫ్టుల్లో ముగ్గురూను. ఒక్కొక్కడూ ఒక్కోరకంగా పీక్కు తింటాడు మీ పర్సనల్ కోడ్ల మీద ఆన! వరస తప్పడం లేదు మిస్టర్ జస్టిస్ మాకు తెలుసు–మీ న్యాయానికి లింగ భేదాలున్నాయని మీకో ఉచిత సలహా 'పుల్లింగ చట్టం'తో న్యాయదేవతకు శిరచ్ఛేదనం చేసి న్యాయదేవుణ్ణి ప్రతిష్ఠించుకోండి.

ఈవ్ టీజింగ్ చేయనివాడు ఆడమ్ కాలేకపోతున్నాడు.

పుట్టిన దగ్గర్నుంచి పుడకల వరకూ

ఇదే పురుషుడి పూర్తికాలపు ఉద్యోగం చచ్చాక కూడా రాయల్ ఈన్స్ రంభా ఊర్వశులను ఏప్పించవచ్చున్నది.

వీళ్ళ పుణ్యకార్యాల్లో వుండే బూతు కల దేవేంద్రుడు వీరి యిష్టదైవం వాత్సాయన కామసూత్రం వీరికి పూజనీయం ఏకపత్నీ వ్రతం, బహువేశ్యా వ్రతం ఒకే దేవుడికి రెండు అవతారాలు ఇంకా అర్థం కాలేదా న్యాయాధిపతిగారూ తన బిడ్డని చంపుకోవడానికి కారణం స్ఫురించలేదా? 'దైవ ప్రసాదిత' కుంతీ సంతతిలో ఒక్క ఆడజీవి వున్నా మీకు బోధపడేది కుంతే కాదు ఏ యింతి కనపడ్డా గర్భాదానపు దేవుళ్ళు పైనుంచి దిగుతారు

తేడాయల్లా

సహజ కవచ కుండలాలతో కర్ణుడు పుట్టినట్లు

సహజ గర్భసంచితో ఒక కర్ణిక పుట్టక పోవడమే

నిజమే నెత్తుటి కందును గుండెకు హత్తుకొని, కన్నీటితో

ముద్దాడి గొంతును నులిమేసింది ఆమె అమృత హస్తం

# ట్రాఫిక్ చలాన్ల వసూలుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..

## ఈ–చలాన్లను కరెంట్ బిల్లులో కలిపేయాలని సూచన..

## దేశవ్యాప్తంగా రూ.45 వేల కోట్ల చలాన్లు పెండింగ్.

## చలాన్లు కట్టనివారికి ఆర్సీ రెన్యువల్ నిలిపివేయాలని సలహా..

హైదరాబాద్,ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనదారుల నుంచి ఈ–చలాన్ల వసూలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు సుప్రీంకోర్టు కీలక సూచనలు చేసింది. పేరుకుపోయిన చలానాల మొత్తాన్ని వాహనదారుల విద్యుత్ బిల్లులకు జోడించి వసూలు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. దేశంలో ప్రస్తుతం అనుసరిస్తున్న సంప్రదాయ పద్ధతుల ద్వారా వసూళ్లు చేయడం కష్టమని ధర్మాసనం అభిప్రాయపడింది.దేశవ్యాప్తంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో దాదాపు రూ.45 వేల కోట్ల విలువైన ఈ–చలాన్లు పెండింగ్‌లో ఉండగా, ఇప్పటివరకు కేవలం రూ.25 వేల కోట్లు మాత్రమే వసూలైనట్లు సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి వచ్చింది. ఈ భారీ బకాయిలపై జస్టిస్ పార్థివాలాతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ.. “ఒకే మార్గంలో పయనిస్తామంటే ఈ దేశంలో సాధ్యం కాదు. ఈ–చలాన్ల మొత్తాన్ని విద్యుత్ బిల్లులతో అనుసంధానించండి” అని వ్యాఖ్యానించింది.చలాన్లు చెల్లించని వాహనదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని కోర్టు సూచించింది. అటువంటి వారికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ) పునరుద్ధరణను నిలిపివేయడం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీని నిరాకరించడం వంటి చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది. బకాయిల వసూలు కోసం అధికారులు వినూత్నమైన, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది.


Advertisment Tariff

| | | |
|---|---|---|
| కలర్ ఫుల్ పేజీ (బ్యాక్) | : | రూ.50,000/- |
| కలర్ ఆఫ్ పేజీ (బ్యాక్) | : | రూ.30,000/- |
| కలర్ క్వాటర్ పేజీ (బ్యాక్) | : | రూ. 20,000/- |

**బ్లాక్ & వైట్**

| | | |
|---|---|---|
| ఫుల్ పేజీ | : | రూ.30,000/- |
| ఆఫ్ పేజీ | : | రూ. 20,000/- |
| క్వాటర్ పేజీ (బ్యాక్) | : | రూ. 10,000/- |

Cell : 9381205266
8977022449

విలేకరులు కావలెను

తెలంగాణ వ్యాప్తంగా మీ ముందుకు వస్తున్న

**జన సమయం**

పక్షపత్రికకు

తెలంగాణలోని అన్ని నియోజక వర్గాల నుండి

**విలేకరులు కావలెను**

ఆసక్తి కలిగినవారు సంప్రదించండి

సెల్ : 9381205266
8977022449

## ఆరోగ్యం

# పోషకాల గని

పాలకూరలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి, కానీ విటమిన్లు, మినరల్స్ అత్యధికంగా ఉంటాయి.

విటమిన్‌ా, జ, ఖ: శరీర రోగనిరోధక శక్తిని పెంచడానికి, చర్మ ఆరోగ్యానికి, రక్తం గడ్డకట్టడానికి ఇవి ఎంతగానో తోడ్పడతాయి.

ఐరన్ (ఇనుము): రక్తహీనత (ూఅవఎఋ) సమస్యతో బాధపడేవారికి పాలకూర ఒక సహజసిద్ధమైన ఔషధం.

ఫోలేట్ : గర్భిణీ స్త్రీలకు మరియు కణాల పునరుత్పత్తికి ఫోలేట్ చాలా అవసరం.

**2. కంటి చూపు మెరుగుపడుతుంది .**

పాలకూరలో లూటిన్ , జెయాంటిన్ (అనే యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.

ఇవి సూర్యుని నుండి వచ్చే హానికరమైన నీలి కాంతి ప్రభావం నుండి కళ్ళను కాపాడతాయి.

వయసు పెరగడం వల్ల వచ్చే కంటి సమస్యలు , క్యాటరాక్ట్ (అవస్కరం) వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

**3. రక్తపోటు నియంత్రణ గుండె ఆరోగ్యం .**

పాలకూరలో ఉన్న నైట్రేట్లు రక్తనాళాలను విస్తరించేలా చేసి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. దీనివల్ల అధిక రక్తపోటు నివారించబడుతుంది.

పొటాషియం ఉండటం వల్ల శరీరంలో సోడియం ప్రభావాన్ని తగ్గించి గుండె జబ్బుల ప్రమాదాన్ని నివారిస్తుంది.

**4. క్యాన్సర్ నివారణకు తోడ్పడుతుంది .**

పాలకూరలో లభించే మరియు వంటి మూలకాలు క్యాన్సర్ కణాల ఎదుగుదలను అడ్డుకుంటాయి.

లముఖ్యాతి ముఖ్యంగా గర్భాశయ క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్ మరియు రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో ఇది సహాయపడుతుందని పరిశోధనలు తెలుపుతున్నాయి.

**5. ఎముకల బలం .**



పాలకూరలో విటమిన్-ఖ మరియు క్యాల్షియం సమృద్ధిగా ఉంటాయి. విటమిన్ ఖ ఎముకలకు అవసరమైన క్యాల్షియాన్ని సరిగ్గా గ్రహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

ఆస్టియోపోరోసిస్ (ఎముకలు బలహీనపడటం) సమస్య నివారణకు పాలకూర క్రమం తప్పకుండా తీసుకోవాలి.

6. జీర్ణక్రియ మెరుగుదల ఉ బరువు తగ్గేందుకు

పాలకూరలో పీచు పదార్థం మరియు నీటి శాతం ఎక్కువగా ఉంటాయి. ఇది మలబద్ధకాన్ని నివారించి, పేగుల ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

తక్కువ క్యాలరీలు ఉండి కడుపు నిండిన భావనను కలిగిస్తుంది కాబట్టి, బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఉత్తమమైన ఆహారం.

7. దయాబెటిస్ నియంత్రణ

పాలకూరలో ఉండే ఆల్ఫా-లిపోయిక్ యాసిడ్ అనే యాంటీఆక్సిడెంట్ రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గించడంలో మరియు ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచడంలో సహాయపడుతుంది.

జాగ్రత్తలు ..

కిడ్నీలో రాళ్లు ఉన్నవారు: పాలకూరలో ఆక్సలేట్లు ఎక్కువగా ఉంటాయి, కాబట్టి కిడ్నీ స్టోన్స్ ఉన్నవారు వైద్యుల సలహా మేరకు మాత్రమే తీసుకోవాలి.

# పోపుల పెట్టెలోని దివ్యౌషధం



**1. మధుమేహం (డయాబెటిస్) నియంత్రణ**

మెంతులు టైప్-1, టైప్-2 డయాబెటిస్‌తో బాధపడేవారికి గొప్ప ఔషధంగా పనిచేస్తాయి.

కరిగే పీచు పదార్థం : మెంతులలో ఉండే గలక్టోమన్నన్ అనే ఫైబర్, రక్తంలో చక్కెర మరియు కార్బోహైడ్రేట్లు పీల్చుకునే వేగాన్ని తగ్గిస్తుంది.

ఇన్సులిన్ ఉత్పత్తి: మెంతులలో ఉండే 4-హైడ్రాక్సీ ఐసోల్యూసిన్ అనే అమైనో ఆసిడ్ ఇన్సులిన్ స్రావాన్ని పెంచి, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను అదుపులో ఉంచుతుంది.

**2. జీర్ణక్రియ సమర్థవంతంగా మెరుగుదల.**

జీర్ణసంబంధిత సమస్యలతో బాధపడేవారికి మెంతులు తక్షణ ఉపశమనం కలిగిస్తాయి.

కడుపులో మంట ఉ ఎసిడిటీ: ఉదయాన్నే నానబెట్టిన మెంతులు తినడం లేదా ఆ నీటిని తాగడం వల్ల పొట్టలో రక్షణ పొర ఏర్పడి, గుండె మంట తగ్గుతుంది.

మలబద్ధకం నివారణ: ఇందులో ఉండే అధిక పీచు పదార్థం పేగుల కదలికలను సులభతరం చేసి, మలబద్ధకాన్ని దూరం చేస్తుంది.

**3. గుండె ఆరోగ్యం ఉ కొలెస్ట్రాల్ తగ్గింపు.**

మెంతులు శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ మరియు ట్రైగ్లిజరైడ్ల స్థాయిలను తగ్గిస్తాయి.

పొటాషియం సమృద్ధిగా ఉండటం వల్ల ఇది సోడియం ప్రభావాన్ని తగ్గించి, రక్తపోటును అదుపులో ఉంచుతుంది. తద్వారా గుండెపోటు ప్రమాదాన్ని నివారిస్తుంది.

**4. బరువు తగ్గేందుకు సహకారం.**

ఉదయాన్నే పరగడుపున నానబెట్టిన మెంతులు నమిలి తింటే, అందులోని గలక్టోమన్నన్ పొట్ట నిండిన భావనను కలిగిస్తుంది.

దీనివల్ల అనవసరమైన ఆకలి తగ్గి, బరువు పెరగకుండా నియంత్రణలో ఉంటుంది.

**5. చర్మం మరియు కేశ సంరక్షణ**

మెంతులు కేవలం ఆరోగ్యానికే కాక సౌందర్య సాధనంగా కూడా అద్భుతంగా పనిచేస్తాయి.

కుదుళ్ల బలం ఉ చుండ్రు నివారణ: మెంతి పిండిని పెరుగు లేదా అలోవెరాతో కలిపి తలకు ప్యాక్‌లా వేసుకోవడం వల్ల చుండ్రు తగ్గుతుంది, వెంట్రుకలు రాలడం తగ్గి ఒత్తుగా పెరుగుతాయి.

చర్మ సౌందర్యం: మెంతుల్లోని యాంటీఆక్సిడెంట్లు మొటిమలు, మచ్చలు తగ్గించి, చర్మానికి సహజమైన మెరుపును ఇస్తాయి.

**6. బాలింతలలో పాలు పెరగడానికి .**

ఆయుర్వేదం ప్రకారం, ప్రసవానంతరం బాలింతలకు మెంతులు లేదా మెంతి పప్పు, మెంతి లడ్డూలు తినిపించడం వల్ల పాలు సమృద్ధిగా పడతాయి .

**7. స్త్రీల ఆరోగ్య సమస్యలు.**

మెంతి గింజలలో ఉన్న ఈస్ట్రోజెన్ లాంటి లక్షణాలు ఋతుక్రమ సమయంలో వచ్చే కడుపునొప్పి, తిమ్మిర్లను తగ్గిస్తాయి.

పీసీఓడీ మరియు మెనోపాజ్ సమయంలో వచ్చే శారీరక అసమతుల్యతలను అదుపు చేయడానికి ఇవి ఎంతగానో దోహదపడతాయి.

మెంతులను ఎలా ఉపయోగించాలి?

మెంతి నీళ్లు: అర టీస్పూన్ మెంతులను రాత్రి ఒక గ్లాసు నీటిలో నానబెట్టి, ఉదయాన్నే ఆ నీటిని తాగి, మెంతులను నమిలి తినవచ్చు.

మెంతి పొడి: దోరగా వేయించిన మెంతుల పొడిని ప్రతిరోజూ మోతాదుగా గోరువెచ్చని నీటితో తీసుకోవచ్చు.

జాగ్రత్తలు ..

అతిగా తినకూడదు: రోజుకి 1-2 టీస్పూన్లకు మించి వాడకూడదు. అతిగా తింటే కడుపులో గ్యాస్, వికారం రావచ్చు.

గర్భిణీ స్త్రీలు: గర్భధారణ సమయంలో మెంతులను అధికంగా తీసుకోకూడదు (ఇది గర్భాశయ సంకోచాలకు దారితీసే అవకాశం ఉంది).

# స్వర్ణంతో ముగిసిన భారత అథ్లెటిక్స్ ప్రస్థానం

క్రీడలు





ఐచి-నగోయా ఏషియన్ గేమ్స్‌లో భారత అథ్లెటిక్స్ బృందం తన ప్రయాణాన్ని స్వర్ణ కాంతులతో ముగించింది. ఏడు రోజుల పాటు ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో సాగిన పోరులో ఎన్నో ఎత్తుపల్లాలు ఎదుర్కొన్న భారత అథ్లెట్లు చివరి రోజున అద్భుత ప్రదర్శనతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ముఖ్యంగా మహిళల 4×400 మీటర్ల రిలేలో సాధించిన స్వర్ణం భారత అథ్లెటిక్స్‌కు చిరస్మరణీయ ముగింపును అందించింది. నగోయా సిటీ మిజుహో పార్క్ అథ్లెటిక్స్ స్టేడియంలో కిరణ్ పహల్, పూవమ్మ మాచెట్టిరా, ప్రాచి చౌదరి, విత్యా రామరాజ్‌లతో కూడిన భారత బృందం 3:29.69 సెకన్లలో రేసును పూర్తి చేసి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన పోటీలో బహ్రెయిన్ 3:30.21తో రజత పతకం, చైనా 3:31.02తో కాంస్య పతకం సాధించాయి. ఈ విజయం భారత మహిళల 4×400 మీటర్ల రిలే చరిత్రలో మరో బంగారు అధ్యాయాన్ని జోడించింది. ఏషియన్ గేమ్స్‌లో భారత్‌కు ఈ విభాగంలో ఇది ఆరో స్వర్ణ పతకం. 2002 బుసాన్ నుంచి 2018 జకార్తా వరకు వరుసగా ఐదు ఏషియన్ గేమ్స్‌లో స్వర్ణాలు సాధించిన భారత మహిళలు, 2023 హాంగ్‌జౌలో రజతంతో సరిపెట్టుకున్నారు. నాలుగేళ్ల విరామం తర్వాత మళ్లీ స్వర్ణాన్ని అందుకోవడం ఈ విజయానికి మరింత ప్రత్యేకతను తెచ్చింది. ఈ బృందంలోని పూవమ్మ మాచెట్టిరాకు ఈ స్వర్ణం మరింత మధుర జ్ఞాపకంగా మిగిలింది. ఇంచియాన్ 2014, జకార్తా 2018లో స్వర్ణ పతకాలు సాధించిన భారత జట్లలో ఆమె సభ్యురాలు. ఇప్పుడు ఐచి-నగోయాలోనూ అదే విజయాన్ని పునరావృతం చేసి ఏషియన్ గేమ్స్ వేదికపై తన మూడో స్వర్ణాన్ని అందుకుంది. అయితే ఈ గేమ్స్‌లో అత్యంత ఆకర్షణీయమైన ప్రదర్శనల్లో ఒకటి విత్యా రామరాజ్‌ది. మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో 42 ఏళ్లుగా కొనసాగుతున్న పీటీ ఉష జాతీయ రికార్డును బద్దలు కొట్టిన విత్యా, అదే ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించింది. అంతేకాకుండా మిక్స్‌డ్ 4×400 మీటర్ల రిలేలో రజత పతకం సాధించిన జట్టులోనూ ఆమె భాగస్వామిగా నిలిచింది. చివరగా మహిళల 4×400 మీటర్ల రిలేలో స్వర్ణం సాధించడంతో ఆమె ఐచి-నగోయా ప్రస్థానం మరింత ప్రత్యేకంగా మారింది. మహిళల హైజంప్‌లో పూజా సింగ్ కూడా భారత పతకాల జాబితాలో మరో కాంస్యాన్ని చేర్చింది. 1.84 మీటర్ల ఎత్తును తొలి ప్రయత్నంలోనే అధిగమించిన పూజా, 1.87 మీటర్ల వద్ద మూడు ప్రయత్నాల్లోనూ విఫలమైంది. అయినప్పటికీ కాంస్య పతకంతో పోడియంపై నిలిచింది. మిక్స్‌డ్ 4×100 మీటర్ల రిలేలోనూ భారత్ కొత్త జాతీయ రికార్డుతో కాంస్య పతకాన్ని అందుకుంది. చివరి రోజున భారత్ మొత్తం ఐదు పతకాలు సాధించింది. అందులో ఒక స్వర్ణం, నాలుగు కాంస్యాలు ఉన్నాయి. దీంతో ఐచి-నగోయా ఏషియన్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీల్లో భారత పతకాల సంఖ్య 24కు చేరింది. ఇందులో ఒక స్వర్ణం, తొమ్మిది రజతాలు, 14 కాంస్యాలు ఉన్నాయి. 2023 హాంగ్‌జౌ ఏషియన్ గేమ్స్‌లో భారత్ 29 పతకాలు సాధించింది. ఈసారి మొత్తం పతకాల సంఖ్య గత గేమ్స్‌తో పోలిస్తే తగ్గినప్పటికీ, రిలే ఈవెంట్లలో భారత ప్రదర్శన, కొత్త జాతీయ రికార్డులు, వ్యక్తిగతంగా మెరుగైన ప్రదర్శనలు ప్రత్యేకంగా నిలిచాయి. ఒకప్పుడు ఏషియన్ గేమ్స్‌లో భారత అథ్లెటిక్స్‌కు బలమైన గుర్తింపుగా నిలిచిన మహిళల 4×400 మీటర్ల రిలే మరోసారి స్వర్ణాన్ని అందుకోవడం ఈ ప్రయాణానికి ప్రత్యేక ముగింపును ఇచ్చింది. చివరి రేసులో బాటన్ చేతులు మారిన ప్రతిసారీ పెరిగిన ఉత్కంఠ, చివరికి భారత జెండా ఎగిసిన క్షణంతో ఆనందంగా మారింది.

# ప్యారడైజ్

సినిమా

## సామాన్యుడి నుంచి తిరుగుబాటు నాయకుడిగా?




హైదరాబాద్, పారడైజ్' సినిమాకు వచ్చిన బజ్, క్రేజ్ మరే సినిమాకూ రాలేదు. కేవలం జడల్ లుక్, రెండే రెండు పాటలతో ఇంత హైప్ తెచ్చుకోగలిగింది. ట్రైలర్ లేకుండానే ఈ సినిమా గురించి జనం మాట్లాడుకొనేలా, ఎదురు చూసేలా చేసింది. నాని కెరీర్‌లో కాస్ట్లీ సినిమా ఇది. ప్రీ రిలీజ్ బుకింగ్స్ కూడా అదే రేంజ్ లో కనిపించాయి. ఓ టాప్ హీరో, టైర్ 1 హీరో సినిమాకు కనిపించే హడావుడి.. పారడైజ్ విషయంలో కనిపించింది. ఈ సినిమా కొడితే ? నాని ఇంకో పది మెట్లు పైకి ఎదుగుతాడు. శ్రీకాంత్ ఓదెల అనే దర్శకుడు స్టార్ హీరోల కంట్లో పడతాడు. తెలుగు చిత్రసీమ కి సరికొత్త జోష్ వస్తుంది. ఇన్ని జరగాలంటే పారడైజ్ పంట పండాలి. మరి.. పారడైజ్ ఈ హైప్‌ని, క్రేజ్‌ని, అంచనాల్నీ అందుకోగలిగిందా?దేశానికి వచ్చిన స్వాతంత్ర్యం తమ వరకూ రాని సవారీ జాతి కథ ఇది. హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న పారడైజ్ ప్రాంతం అది. దాదాపు 5 వేలమంది సవారీలు అక్కడ ఎలాంటి గుర్తింపు లేకుండానే బతికేస్తుంటారు. అసలు వాళ్లు జనాభా లెక్కల్లోనే లేరు. ఆ ప్రాంతాన్ని శికంజా మాలిక్ (మోహన్ బాబు) నియంతలా పరిపాలిస్తుంటాడు. సవారీలకు ఎట్టి పరిస్థితుల్లోనూ గుర్తింపు రాకుండా చూసుకొంటుంటాడు. సవారీ జాతిలో సమ్మక్క (సోనాలీ కులకర్ణి) ఓ ధిక్కార స్వరం. ఆమెకు పుట్టినవాడే.. జడల్ (నాని). అమ్మంటే.. జడల్ కు అసహ్యం. చిన్నప్పుడే హత్యానేరంపై జైలుకి వెళ్లి? పద్నాలుగేళ్ల తరవాత తిరిగొస్తాడు. తన ఆశయం? శికంజా మాలిక్ ని చంపడమే. మరి? జడల్ ఆశ నెరవేరిందా? సవారీలకు గుర్తింపు ఎలా వచ్చింది? ఈ కథలో సుబ్బు (కయాదు లోహర్) పాత్రేమిటి? పారడైజ్ లో చిన మాలిక్ (రాఘవ్ జుయల్) సృష్టించిన విధ్వంసం ఎట్టిది? ఇవన్నీ? పారడైజ్ సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.ఒక ప్రాంతం, అక్కడ అణగదొక్కడబడిన జాతి, ఆ జాతిపై ఆధిపత్యం చెలాయించే

విలన్, వాడికో మూర్ఖపు కొడుకు? విలన్ పై తిరుగుబాటు చేసే హీరో ? ఇదంతా చాలా పురానా ఫార్ములా. ఛత్రపతిలో చూసింది ఇలాంటి కథే. ఆ తరవాత చాలామంది దర్శకులు.. ఈ పాయింట్ పట్టుకొని సినిమాలు తీశారు. ఇప్పుడు శ్రీకాంత్ ఓదెల కూడా అదే చేశాడు. అయితే పాత కథల్ని కొత్తగా చెప్పాలన్న సూత్రాన్ని మాత్రం శ్రీకాంత్ కాస్తో కూస్తో ఒంట బట్టించుకొన్నాడు. అందుకే పారడైజ్ అనే ఓ ప్రపంచాన్ని సృష్టించాడు. హీరో చేతికి పచ్చబొట్టు (అదేంటో అందరికీ తెలుసు) పొడిపించాడు. హీరోకి జడలు వేశాడు. హీరోయిన్ పాత్రని సైతం డిఫరెంట్ గా రాయాలనే చూశాడు. వెబ్ సిరీస్ పాట్రన్ అలవాటు పడుతున్న ప్రేక్షకుల కోసం సినిమాని చాప్టర్లుగా డివైడ్ చేశాడు. ఇలా చాలా చాలానే ప్రయత్నించాడు. ఇన్ని చేసినా.. అసలు సిసలైన ఎమోషనల్ కనెక్షన్ అనేది ఇవ్వడం మర్చిపోయాడు. అది లేక.. హై ఓల్టేజ్ సీన్లు అని దర్శకుడు మనసులో అనుకొని, భారీగా తీసిన వన్నీ బోల్తా పడిపోయాయి. చాప్టర్ కీ చాప్టర్ కీ మధ్య ఓ కనెక్షన్ అనేది బిల్డ్ అవ్వలేదు. అసలు ఈ చాప్టర్ల గోలేంటి? అని కూడా అనిపిస్తుంటుంది. తెరపై అన్నీ ఉన్నా ? ఏదో మిస్ అవుతున్న ఫీలింగ్ కొన్నిసార్లు కలుగుతుంటుంది. ఆ ఏదో ఏమిటన్నది చాలా సినిమాల్లో అర్థం కాదు. పారడైజ్‌కి ఆ గొడవ లేదు. ఎమోషన్ మిస్సవుతుంది అనే సంగతి ప్రతీ సీన్‌లోనూ ప్రేక్షకుడికి అర్థం అవుతూనే ఉంటుంది. దర్శకుడికి ఆ సంగతి అర్థం కాలేదు. పారడైజ్ కోసం శ్రీకాంత్ సృష్టించుకొన్న సెటప్పులు బాగున్నాయ్. ఆ సెటప్పుల్లో ఉన్న పాత్రలు రెగ్యులర్ గా ఉన్నా ? కావల్సినంత ఎమోషన్ బిల్డప్ అవ్వడానికి ఈమాత్రం సరుకు సరిపోతుంది. కానీ.. దర్శకుడు ఎమోషన్ అనేది పైపై పూతే అనుకొన్నాడు. అందుకే చాలా సన్నివేశాల్లో ఎమోషన్ ఒక కోటింగ్ లానే కనిపిస్తుంది తప్ప? దాన్ని ప్రేక్షకుడు పూర్తి స్థాయిలో ఆస్వాదించేలా చేయలేకపోయాడు. సినిమా ప్రారంభమైన తొలి పది నిమిషాల్లో ఓ హై వస్తుంది. పారడైజ్ ప్రాంతాన్ని సమ్మక్క మాటల ద్వారా పరిచయం చేయడం, జైల్లో హీరో క్యారెక్టర్ ని రివీల్ చేయడం, కథలోని కాన్‌ఫ్లిక్ట్ ఏమిటన్నది అర్థమయ్యేలా చెప్పడం? ఇవన్నీ తొలి పది నిమిషాల్లోనే జరిగిపోతుంది. హీరో ఎప్పుడైతే పారడైజ్ లో అడుగు పెట్టాడో అక్కడ నుంచి గేమ్ మొదలవ్వాలి. కానీ.. అక్కడ విచిత్రంగా మాలిక్ పాత్రని సైడ్ చేసేశారు. ఇక నుంచి నేను మీకు కనిపించను?నా బాధ్యత అంతా నా కొడుకు తీసుకొంటాడు అని మోహన్ బాబు తో చెప్పించి, ఆ పాత్రని హైడ్ చేయడం చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇది స్క్రీన్ ప్లే పరంగా దర్శకుడు చేసిన పెద్ద పొరపాటు. ఓరకంగా ఎస్కేపిజం. మోహన్ బాబు లాంటి విలన్ ని పెట్టుకొని, హీరోతో విలన్ కు కావాల్సిన కాన్‌ఫ్లిక్ట్ వేసుకొన్నా? వీరిద్దరూ ఎప్పుడు ఎదురుపడితే అప్పుడు కథ అయిపోతుందని భయపడ్డ దర్శకుడు? విలన్ ని హీరో కంట కనిపించకుండా దాచేయడం అనేది పెద్ద మిస్టేక్. ఆ స్థానంలో విలన్ కొడుకుని తీసుకొచ్చినా? దమ్ము సరిపోలేదు. నువ్వు ఎం.ఎల్.ఏవి అవ్వడం కాదు కదా, కనీసం నామినేషన్ కూడా వేయించనివ్వను..అని హీరో ఛాలెంజ్ చేయడం వరకే సరిపోయింది తప్ప, అందుకోసం జడల్ చేసిందేమిటన్నది అర్థం కాదు, ఈ గ్యాప్ ఫిల్ చేయడానికి హీరోయిన్ సుబ్బు పాత్రని ప్రవేశ పెట్టారు. సుబ్బు కథ ఇంచుమించుగా సమ్మక్క కథలానే ఉంటుంది. సమ్మక్క తన బిడ్డని కాపాడుకోవడానికి వేశ్య అయ్యింది. సుబ్బు.. తన తండ్రి పరువు నిలబెట్టడానికి తప్పుడు దారిలో వెళ్లింది. అంతే తేడా. ఇంట్రవెల్ లో ఒకటో రెండో తలకాయలు గాల్లో లేచిపోతే.. ఎమోషన్ వచ్చేస్తుంది అనుకొంటే పొరపాటు. ఆ పొరపాటు శ్రీకాంత్ ఓదెల కూడా చేసేశాడు. ఇంట్రవెల్ లో విలన్ కొడుకుని చంపి? విలన్ ఇంట్లో సవారీ గ్యాంగ్ తో సహా అడుగుపెడతాడు హీరో. అక్కడ మళ్లీ? మోహన్ బాబు ఉండడు. ఉంటే గనుక.. ఈ కథ ఇంట్రవెల్ దగ్గరే అయిపోదును. కాబట్టి? హీరో ? విలన్.. ఇంట్రవెల్ లో కూడా ఎదురు పడకుండా చూసుకోగలిగాడు దర్శకుడు. సెకండాఫ్ లో కూడా కథ అక్కడక్కడే గింగిరాలు తిరుగుతుంటుంది.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

## ప్రభుత్వవిప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్, (జనసమయం ప్రతినిధి): పేద ప్రజలకు అండగా నిలుస్తూ వారి సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి చెందిన 195 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.91,03,750 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ నగరానికి చెందిన 133 మంది లబ్ధిదారులకు రూ.63,38,250, మహబూబ్‌నగర్ రూరల్ మండలానికి చెందిన 24 మంది లబ్ధిదారులకు రూ.9,54,000, హన్వాడ మండలానికి చెందిన 39 మంది లబ్ధిదారులకు రూ.18,11,500 విలువైన చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు నియోజకవర్గంలో రెండు వేల మందికి పైగా లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించామని, అనేకమందికి వైద్య చికిత్సల కోసం ఎల్‌ఓసీలు కూడా మంజూరు చేయించామని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేదల పత్రాలను పరిశీలించి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు హైదరాబాద్‌లోని సంబంధిత అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ చెక్కులు మంజూరయ్యేలా కృషి చేస్తున్నామని వివరించారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇప్పటివరకు నియోజకవర్గానికి ఐదు వేల ఐదువందల ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరో 5,000 ఇళ్లను మంజూరు చేయిస్తామని ఆయన స్పష్టం చేశారు. తద్వారా మరింత మంది నిరుపేదలకు సొంత ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించాలనే లక్ష్యంతో కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ చేపట్టామని, దరఖాస్తుల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులను పరిశీలించి కార్డులను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని పేర్కొన్నారు. రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, గతంలో ఎదురైన నాణ్యతాపరమైన సమస్యలు లేకుండా మెరుగైన నాణ్యతతో బియ్యం అందిస్తున్నామని వివరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాను, తన సిబ్బంది, పీఏలు, పార్టీ నాయకులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటున్నామని ఆయన తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. పట్టణ సమస్యల పరిష్కారంలో మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు సమన్వయంతో పనిచేస్తున్నారని, మండల స్థాయిలోనూ నాయకులకు బాధ్యతలు అప్పగించి ప్రజలకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కేవలం ఎమ్మెల్యేపైనే ఆధారపడకుండా ప్రతి ఒక్కరూ సమష్టి బాధ్యతతో పనిచేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు కాని అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు వాస్తవాలను తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బుద్దారం సుధాకర్ రెడ్డి, హన్వాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వి. మహేందర్, రాష్ట్ర కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యదర్శి ఏర్పుల నాగరాజు, హన్వాడ మండల కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు చెన్నయ్య, పట్టణ కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజ్మత్ అలీ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అవేజ్, హన్వాడ మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నవనీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు సీబీ పూజిత, రామస్వామి, ఆంజనేయులు, షబ్బీర్ అహ్మద్, కిషన్ నాయక్, రఘు, ఫక్రు ఖురేషి, పెద్ద గొల్ల నర్సింహులు, తాహేర్, చిన్న, మేగ్యా నాయక్, ఉమర్ కొత్వాల్, ముజీబ్, అలాగే కాంగ్రెస్ నాయకులు జి. నర్సింహులు, మైత్రి యాదయ్య, అబ్దుల్ హక్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సిరిగిరి మురళి, లీడర్ రఘు, ఖాజా పాషా, మోతీలాల్, జాజిమొగ్గ నర్సింహులు, శరత్ చంద్ర, రఘురామిరెడ్డి, జేసీఆర్, వెంకటయ్య, చంద్రమౌళి, అలీం, అశ్వాక్ , మోయాజ్ , తదితరులు హాజరయ్యారు.



# జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్,(జనసమయం ప్రతినిధి) ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తున్న జర్నలిస్టుల సేవలు అమోఘమని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం, ప్రెస్‌క్లబ్ విజ్ఞప్తి మేరకు ఎస్వీఎస్ ఆసుపత్రి, మెడికల్ కాలేజీ సౌజన్యంతో జిల్లాలోని జర్నలిస్టులు, వారి సతీమణుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అధికారాన్ని వినియోగిస్తూ సామాన్య ప్రజలతో మమేకమై పనిచేయడమే నిజమైన నాయకత్వమని అన్నారు. సమాజ హితం కోసం నిరంతరం పనిచేసే జర్నలిస్టుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు సమగ్ర మాస్టర్ హెల్త్ చెకప్‌ను ఉచితంగా అందించేందుకు ముందుకు వచ్చిన ఎస్వీఎస్ ఆసుపత్రి యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. తక్కువ ఖర్చుతో అత్యున్నత వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నాగం జనార్దన్ రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఏర్పాటైన ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రి రెండు దశాబ్దాలకు పైగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకు విశేష వైద్య సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లో ఇలాంటి మెడికల్ కాలేజీ, ఆసుపత్రి ఉండటం స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోని విధంగా స్థానికంగానే అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు ఎస్వీఎస్ ప్రాంగణంలో కొత్త వైద్య పరికరాలు, సదుపాయాలను సమకూరుస్తున్నారని తెలిపారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి వచ్చేలా ఎస్వీఎస్ వైద్య సేవలపై మీడియా



విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. చిన్న ఆరోగ్య సమస్యలను సైతం నిర్లక్ష్యం చేయకుండా ప్రజలు ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

జర్నలిస్టులు తీవ్ర పని ఒత్తిడి, న్యూస్ కాంపిటీషన్ కారణంగా అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఎస్వీఎస్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ కేజీ రెడ్డి అన్నారు. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలు, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో జర్నలిస్టులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎస్వీఎస్ ఆసుపత్రిలో సుమారు రూ. 80 కోట్లతో అత్యాధునిక వైద్య సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా క్యాన్సర్ చికిత్స అందించేలా కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ఏడాది కాలంలో ఎస్వీఎస్‌లో రేడియోథెరపీ, కీమోథెరపీ సదుపాయాలతో కూడిన అత్యాధునిక క్యాన్సర్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఎప్పుడైనా ఎస్వీఎస్ ఆసుపత్రి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాకిట అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ నగర మేయర్ గుమ్మాల మమతా శ్రీనివాస్, ఎస్వీఎస్ ఆసుపత్రి రెసిడెంట్ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరేందర్ చారి, కాంగ్రెస్ నేతలు మైత్రి యాదయ్య, వాల్డాస్ ప్రతాప్ గౌడ్, పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




Editor, Publisher & Owner, & Place of Publication: V. YADAMMA H.No. C154,Parvathapur Village,Ghanapur Mandal Wanaparthy Dist.Telangana - 509380, email : janasamayam@gmail.com, Cell : 9381205266,8977022449 Printed at : Mythri Art Printers, Shop No. 10, Dcc Bank Complex, Mahabubnagar,Telangana-509001. Office : H.No. 4-42-332, Chennareddy Nagar, Asbestos Colony, Hyderabad (TG) 500037 www.janasamayam.com